MAHANAGAR DINAPATRIKA

మహానగర్

విజయవాడ | సంపుటి : 10 | సంచిక : 298 | పేజీలు : 8 | శనివారం 17 అక్టోబర్ 2026 | వెల : 6-00



నామినేషన్ల వేళ
రణరంగం

- పుంగనూరు, రాయచోటిలో హింసాత్మక ఘటనలు
- ఎంపీ మిథున్ రెడ్డి కాన్వాయ్‌పై దాడి
- రాయచోటిలో వైసీపీ కార్యాలయానికి నిప్పు
- ధర్మవరంలోనూ రాజకీయ ఘర్షణలు
- నామినేషన్ల తొలిరోజే దద్దరిల్లిన రాయలసీమ

అమరావతి, మహానగర్

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల సమరం తొలిరోజే తీవ్ర హింసాత్మక రూపు దాల్చింది. ప్రజాస్వామ్యబద్ధంగా జరగాల్సిన నామినేషన్ల ఘట్టం అడుగడుగునా దాడులు, ప్రతిదాడులు, దహనకాండలతో రణరంగాన్ని తలపించింది. అన్నమయ్య జిల్లా పుంగనూరు, రాయచోటి, శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరంలో చోటుచేసుకున్న భీకర ఘర్షణలు రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. పల్లెపోరు పండుగ వాతావరణంలో జరగాల్సి ఉండగా, రాజకీయ పార్టీల శ్రేణుల మధ్య చెలరేగిన ఆధిపత్య పోరు చివరకు ప్రాణాల మీదకు తెచ్చే స్థాయికి చేరింది. ఎగిసిపడుతున్న మంటలు, గాల్లోకి పేలుతున్న తూటాలు, ధ్వంసమవుతున్న వాహనాలతో ఆయా ప్రాంతాల ప్రజానీకం ప్రాణగుప్పిట్లో బిక్కుబిక్కుమంటూ గడుపుతోంది. స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన రోజే రాయలసీమలోని పలు ప్రాంతాలు అక్షరాలా యుద్ధభూమిగా మారాయి. రాజకీయ పార్టీల కార్యకర్తల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా ఉన్న వాతావరణం ఏకంగా దౌర్జన్యాలకు దారితీసింది. నాయకత్వాన్ని ఎన్నుకునే ఈ పవిత్ర ప్రక్రియలో భౌతిక దాడులు, బెదిరింపులు, కారుచిచ్చులు చోటుచేసుకోవడం ప్రజాస్వామ్య ప్రియులను కలవరపెడుతోంది. పరిస్థితిని అదుపు చేయడానికి పోలీసులు రంగంలోకి దిగినా, మూకదాడుల ఉద్ధృతికి అడుగడుగునా శాంతిభద్రతలు సవాల్‌గా మారాయి.

పుంగనూరులో తారాస్థాయికి ఉద్రిక్తతలు.

పుంగనూరు మున్సిపాలిటీలో చోటుచేసుకున్న ఘటనలు రాష్ట్రవ్యాప్తంగా భయాందోళనలు రేపాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ పక్ష నాయకుడు, రాజంపేట ఎంపీ పి.వి. మిథున్ రెడ్డి తన అనుచరులతో కలిసి నామినేషన్ల కేంద్రానికి వెళ్తున్న సమయంలో ప్రత్యర్థి వర్గాలు మూకుమ్మడిగా దాడికి దిగాయి.

ఇనుప రాడ్లు, కర్రలు, రాళ్లతో కాన్వాయ్‌పై విరుచుకుపడటంతో పరిస్థితి క్షణాల్లో అదుపుతప్పింది. నామినేషన్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లను సైతం లెక్కచేయకుండా ఆందోళనకారులు చొచ్చుకొచ్చే ప్రయత్నం చేయడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. లాఠీఛార్జి చేసినా - మిగతా 2లో



బంగ్లాదేశ్ తరహాలో పాలన మార్పునకు
కాంగ్రెస్ కుట్ర

- రాహుల్‌పై రాజ్‌నాథ్ సంచలన ఆరోపణలు
- భారత్‌లో బంగ్లాదేశ్ తరహా పాలన మార్పునకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని రాజ్‌నాథ్ ఆరోపణ
- ప్రజాస్వామ్యం పేరుతో దేశంలో అరాచకం సృష్టించాలని చూస్తోందని విమర్శ
- రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నేతలపై రక్షణ మంత్రి తీవ్ర వ్యాఖ్యలు
- అధికారం కోసమే రాజ్యాంగ సంస్థలను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపణ
- ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీని ప్రస్తావిస్తూ కాంగ్రెస్‌పై విమర్శలు

5లో

రాష్ట్రాన్ని జంగిల్‌రాజ్‌గా
మార్చేశారు



- ఎన్నికలను సజావుగా నిర్వహించాలని చంద్రబాబుకు లేదు
- మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం
- ఎంపీ మిథున్‌రెడ్డికి ఫోన్.. దాడి ఘటనపై ఆరా
- చంద్రబాబు అధికార దుర్వినియోగం చేస్తున్నారని మండిపాటు
- పారామిలటరీ బలగాలతోనే ఎన్నికలు సజావుగా సాగుతాయి
- అన్యాయాలను సమర్థంగా ఎదుర్కొంటామని స్పష్టీకరణ
- దాడులు, దౌర్జన్యాలపై చట్టపరంగా పోరాటం చేస్తామని ప్రకటన

అమరావతి, మహానగర్

రాజంపేట ఎంపీ, వైఎస్సార్‌సీపీ లోక్‌సభా పక్ష నాయకుడు పీవీ మిథున్‌రెడ్డికి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఫోన్ చేసి పుంగనూరులో టీడీపీ శ్రేణుల దాడి ఘటన వివరాలు తెలుసుకున్నారు. రాష్ట్రంలో ఎన్నికలను సజావుగా నిర్వహించాలన్న ఉద్దేశం చంద్రబాబుకు లేదని, రెండున్నరేళ్ల పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉండటంతోనే అరాచకాలకు పాల్పడుతున్నారని వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. హింసాత్మక రాజకీయాలు చంద్రబాబుకు కొత్తేమీ కాదని, రాష్ట్రాన్ని జంగిల్ రాజ్‌లా మార్చేశారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ లోక్‌సభాపక్ష నాయకుడికే భద్రత లేని పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. చంద్రబాబు అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ పోలీసులను ఉపయోగించుకుని అక్రమాలకు పాల్పడుతున్నారని, దాడులు జరుగుతున్నా పోలీసు వ్యవస్థ నిస్తేజంగా ఉండిపోతోందని పేర్కొన్నారు. - మిగతా 2లో

ఇది ప్రభుత్వాన్ని మార్చే కుట్ర

- బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్
- అభిజీత్ దీప్కే, నేహా బోరాను కస్టడీలోకి తీసుకున్న ఢిల్లీ పోలీసులు
- విదేశీ శక్తులతో దేశాన్ని అస్థిరపరిచే ప్రయత్నం చేస్తున్నారు
- ప్రజాస్వామ్యంలో అధికారం ప్రజా తీర్పుతో వస్తుందని వ్యాఖ్య

5



దుర్గమ్మకు పట్టువస్త్రాల
సమర్పణ

సరస్వతీదేవి అలంకారంలోని దుర్గమ్మకు పట్టువస్త్రాలు

అమరావతి, మహానగర్

విజయవాడ దసరా ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి జన్మనక్షత్రమైన మూలానక్షత్రం సందర్భంగా ఇంద్రకీలాద్రిపై సరస్వతీదేవి రూపంలో దర్శనమిచ్చిన దుర్గమ్మను ముఖ్యమంత్రి చంద్రబాబు సతీసమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు, సారె సమర్పించారు. సాయంత్రం ఇంద్రకీలాద్రికి చేరుకున్న చంద్రబాబు, భువనేశ్వరి దంపతులకు వేదపండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పట్టువస్త్రాలు, సారెను తీసుకుని అమ్మవారి దర్శనానికి ముఖ్యమంత్రి వెళ్లారు. పండితుల వేదమంత్రాల నడుమ అంతరాలయంలోకి ప్రవేశించిన చంద్రబాబు ప్రత్యేక పూజలు చేసి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం ఆలయ - మిగతా 2లో

నామినేషన్ల వేళ రణరంగం

-మొదటిపేజీ తరువాయి

గుంపులు చెదరకపోవడంతో ఏకంగా గాల్లోకి కాల్పులు జరపాల్సి వచ్చింది. ఈ భీకర దాడుల్లో ఇద్దరు సీఆర్పీఎఫ్ జవాన్లతో పాటు, ఎంపీ భద్రతా సిబ్బంది గాయపడ్డారు. ఉద్రిక్తతల నడుమ ఎంపీ మిథున్ రెడ్డిని పోలీసులు హుటాహుటిన ఒక ప్రత్యేక గదిలోకి తరలించి, అనంతరం జిల్లా ఎస్పీ ధీరజ్ పర్యవేక్షణలో భారీ బందోబస్తు నడుమ సురక్షిత ప్రాంతానికి చేర్చారు.
రాయచోటి పట్టణంలో దౌర్జన్యాలు మరో భయానక రూపాన్ని సంతరించుకున్నాయి. మాజీ ఎమ్మెల్యే, వైసీపీ సీనియర్ నేత గడికోట శ్రీకాంత్ రెడ్డి కార్యాలయంపై టీడీపీ శ్రేణులు ప్రణాళికాబద్ధంగా దాడి చేసినట్లు తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కార్యాలయం ఆవరణలో ఉన్న వాహనాలపై పెట్రోల్ పోసి నిప్పంటించడంతో పదికి పైగా కార్లు, ద్విచక్రవాహనాలు అగ్నికి ఆహుతయ్యాయి. ఆకాశన్నంటేలా ఎగసిపడుతున్న మంటలు, దట్టమైన పొగతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. దాడి సమయంలో శ్రీకాంత్ రెడ్డి స్వయంగా కార్యాలయంలోనే ఉన్నట్లు ప్రాథమిక సమాచారం అందడంతో ఉద్రిక్తత మరింత పెరిగింది. ఈ విధ్వంసకాండను తమ కెమెరాల్లో బంధించేందుకు ప్రయత్నించిన మీడియా ప్రతినిధులపైనా దుండగులు దాడికి తెగబడటం క్షేత్రస్థాయిలో ఉన్న అరాచక పరిస్థితులకు అద్దం పడుతోంది. శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరంలోనూ నామినేషన్ల ఘట్టం రక్తం చిందించింది. వైసీపీ, టీడీపీ, బీజేపీ శ్రేణుల మధ్య తలెత్తిన ఆధిపత్య పోరు తీవ్ర ఘర్షణకు దారితీసింది. ఇరువర్గాలు రోడ్లపైకి వచ్చి పరస్పరం రాళ్ల వర్షం కురిపించుకోవడంతో నామినేషన్ కేంద్రం వద్ద భీతావహం నెలకొంది. పరిస్థితి చేయిజారిపోతున్న తరుణంలో అదనపు బలగాలతో రంగంలోకి దిగిన పోలీసులు కఠినంగా వ్యవహరించారు. లాఠీలకు పనిచెప్పి ఆందోళనకారులను చెదరగొట్టారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ స్వయంగా ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితులను పర్యవేక్షించి, బందోబస్తును కట్టుదిట్టం చేశారు.
ఎన్నికల సంఘం తలుపుతట్టిన వైసీపీ.
రాష్ట్రవ్యాప్తంగా నామినేషన్ల ప్రక్రియలో చోటుచేసుకున్న ఈ దాడులపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీవ్ర స్థాయిలో మండిపడింది. తమ అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా ప్రతిపక్షాలు భౌతిక దాడులకు, కిడ్నాప్‌లకు పాల్పడుతున్నాయని వైసీపీ నేతలు రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. తక్షణమే జోక్యం చేసుకుని అభ్యర్థులకు రక్షణ కల్పించాలని, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా సాగుతున్న ఈ దాడులపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, ఎన్నికల పవిత్రతను కాపాడాల్సిన గురుతర బాధ్యత ఇప్పుడు యంత్రాంగంపైనే ఉంది.

లిక్కర్ గ్యాంగ్‌కు నిద్ర లేకుండా చేస్తున్న రజత్ భార్గవ

హైదరాబాద్ : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన రూ. 3,500 కోట్ల లిక్కర్ కుంభకోణం కేసులో గ్రౌంతికర నిజాలు బయటపడ్డాయి. అప్పట్లో ఎక్సైజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రజత్ భార్గవ విజయవాడ మేజిస్ట్రేట్ కోర్టు ముందు సెక్షన్ 164 కింద న్యాయమూర్తికి ఇచ్చిన వాంగ్మూలంతో పాటు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ విచారణలో సమర్పించిన ఆధారాలు ఈ స్కామ్ వెనుక ఉన్న అసలు సూత్రధారుల గుట్టును రట్టు చేశాయి. లిక్కర్ దందా మొత్తం నాటి ముఖ్యమంత్రి కార్యాలయం నుంచే పకడ్బందీ కుట్ర ప్రకారం సాగిందని ఆయన వెల్లడించిన నిజాలు పాత పాలకుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాయి. 2022 ఏప్రిల్‌లోనే మద్యం సరఫరా, బ్రాండ్ల కేటాయింపుల్లో జరుగుతున్న అక్రమాలను ఆయన గుర్తించారు. పాపులర్ బ్రాండ్లను తొక్కేసి, డిమాండ్ లేని నకిలీ, లోకల్ బ్రాండ్లకు అడ్డగోలుగా ఇండెంట్లు పెట్టడంపై నాటి బెవరేజెస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరెడ్డికి, ప్రత్యేక అధికారి సత్యప్రసాద్‌కు ఆయన మెమోలు జారీ చేశారు. అయితే, ఆ మెమోలను వెనక్కి తీసుకోవాలని, సదరు అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకోకూడదని అప్పటి సీఎం జగన్ మోహన్ రెడ్డి కోటరీలోని ముఖ్య కార్యదర్శి ధనుంజయ్‌రెడ్డి, ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డిలు ఆయనపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తీసుకొచ్చారు. రజత్ భార్గవ ఆధారాలతో సహా వీటిని దర్యాప్తు సంస్థలకు ఇచ్చారు.ఈ అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రయత్నించినందుకు రజత్ భార్గవ రెక్కలు విరిచేసేలా సీఎంవో కీలక నిర్ణయాలు తీసుకుంది.



ఎక్సైజ్ స్పెషల్ సీఎస్ పరిధిలో ఉండే ఆర్డర్ ఫర్ సేల్ అధికారాలను ఆయన నుంచి రాత్రికి రాత్రే లాక్కొని, తమకు అనుకూలంగా పనిచేసే కిందిస్థాయి అధికారులకు కట్టబెట్టారు. ప్రసిద్ధ బ్రాండ్ల ఇండెంట్లను మ్యాన్యువల్ విధానంలో మార్చేసి, కమిషన్లు చెల్లించే మద్యం కంపెనీలకే ఆర్డర్లు వెళ్లేలా మాయాజాలం చేశారు. ఈ దందాను సీఎం సమీక్షల్లో రజత్ భార్గవ లేవనెత్తినా, ధనుంజయ్‌రెడ్డి ఆ అంశాలను మినిట్స్‌లో చేర్చకుండా తొక్కిపెట్టేవారని, జగన్ కోటరీ ఆదేశాల మేరకు బెంబేలెత్తించడంతో తాను ఒంటరిగా పోరాడలేక మౌనం వహించాల్సి వచ్చిందని ఆయన వాంగ్మూలంలో పేర్కొన్నారు.మరో గ్రౌంతికర విషయం ఏమిటంటే? వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దిగిపోయే ముందు 2019 నుంచి 2024 వరకు జరిగిన గాఈూ ఆర్డర్ల డేటాను, ప్రభుత్వ రికార్డులను మాయం చేసేందుకు ప్రయత్నాలు జరిగాయి. అప్పటి ఎక్సైజ్ కమిషనర్ వివేక్ యాదవ్‌ను పాత తేదీలతో సంతకాలు చేసి డేటాను ట్యాంపర్ చేయమని సీఎంవో నుంచి ఒత్తిడి తెచ్చారని, ఆయన అంగీకరించకపోవడంతో రజత్ భార్గవపై కూడా ఒత్తిడి పెంచారని తెలుస్తోంది. అయితే, తాము ఈ అక్రమాలకు సహకరించలేదని, దానికి సంబంధించిన రికార్డుల పరంపర ఇప్పటికీ సెక్రటేరియట్ ఫైళ్లలో భద్రంగా ఉందంటూ దానికి సంబంధించిన సాక్ష్యాలను కూడా ఆయన ఈడీ దర్యాప్తు అధికారుల ముందుంచారు.ప్రస్తుతం రజత్ భార్గవ ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా ఈడీ, సిట్ విచారణను మరింత వేగవంతం చేశాయి. సీఎంవో స్థాయి నుంచి సాగిన రూ. 3,500 కోట్ల కిక్‌బ్యాక్స్, మనీలాండరింగ్ నెట్‌వర్క్ గుట్టు వీడటంతో నాటి ప్రభుత్వ పెద్దలకు అరెస్టు భయం పట్టుకుంది. ప్రజాధనాన్ని దోచుకుని, జనం ప్రాణాలతో చెలగాటమాడిన లిక్కర్ ముఠా అసలు ముసుగులు త్వరలోనే పూర్తిగా తొలగిపోవడం ఖాయంగా కనిపిస్తోంది.

ఐదు రకాల స్పిరిట్స్‌తో సీగ్రామ్స్ ఎక్స్‌క్లామేషన్

విజయవాడ, మహానగర్:



పెర్నోడ్ రికార్డ్ ఇండియా ఆంధ్రప్రదేశ్‌లో సీగ్రామ్స్ ఎక్స్‌క్లామేషన్ బ్రాండ్‌ను ప్రారంభించింది. గత 30 ఏళ్లలో సంస్థ చేపట్టిన ప్రతిష్టాత్మక ఆవిష్కరణల్లో ఇది ఒకటని ప్రకటించింది. విస్కీ, వోడ్కా, జిన్, రమ్, బ్రాందీ అనే ఐదు రకాల స్పిరిట్స్‌ను ఒకే బ్రాండ్ పరిధిలో, ఒకే ధరల శ్రేణిలో అందించడం దీని ప్రత్యేకత. 26--30 ఏళ్ల వయస్సు గల యువ వినియోగదారులను లక్ష్యంగా చేసుకుని, అందుబాటులో ఉండే ప్రీమియం ధరల్లో విభిన్న రుచులను అందించడమే లక్ష్యంగా రూపొందించారు. ప్రతి ఏడాది రెండు కోట్లకు పైగా వినియోగదారులు చట్టబద్ధమైన మద్యపాన వయస్సులోకి ప్రవేశిస్తున్న నేపథ్యంలో ఈ బ్రాండ్‌కు అవకాశాలు ఉన్నాయని సంస్థ పేర్కొంది. పెర్నోడ్ రికార్డ్ ఇండియా సీఈఓ జీన్ టోబౌల్ మాట్లాడుతూ, ఆధునిక వినియోగదారుల అభిరుచులు, సామాజిక సమావేశాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎక్స్‌క్లామేషన్‌ను రూపొందించినట్లు తెలిపారు. ఐదు విభాగాల్లోనూ ప్రత్యేకమైన తయారీ విధానాలు, రుచులు, డిజైన్లతో ఉత్పత్తులను అందిస్తున్నట్లు వివరించారు. విస్కీలో స్కాచ్ మాల్ట్, బ్రాందీలో భారతీయ, ఫ్రెంచ్ ద్రాక్ష మిశ్రమం, రమ్‌లో భారతీయ బెల్లం రమ్‌తో పాటు జమైకా స్పిరిట్స్ వినియోగించడం ప్రత్యేకతలని సంస్థ వెల్లడించింది.

ఊపందుకోని నామినేషన్లు

విజయవాడ, మహానగర్:

జిల్లాలో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా చైర్‌పర్సన్ పదవులకు శుక్రవారం మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. జిల్లా ఎన్నికల అధికారుల వివరాల ప్రకారం శుక్రవారం నాటికి తిరువూరు మున్సిపాలిటీలో టీడీపీ తరపున ఒక నామినేషన్ దాఖలవగా, కొండపల్లి మున్సిపాలిటీలో ఒక స్వతంత్ర అభ్యర్థి, నందిగామ మున్సిపాలిటీలో వైఎస్సార్‌సీపీ తరపున ఒక నామినేషన్ దాఖలైంది. విజయవాడ నగరపాలక సంస్థ, జగ్గయ్యపేట మున్సిపాలిటీలలో శుక్రవారం ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. జిల్లాలోని ఐదు పట్టణ స్థానిక సంస్థల పరిధిలో మొత్తం 222 వార్డులు ఉండగా, చైర్‌పర్సన్ పదవులకు ఆ రోజు మూడు నామినేషన్లు మాత్రమే నమోదయ్యాయి. జిల్లా ఎన్నికల యంత్రాంగం వెల్లడించిన పార్టీ వారీ వివరాల్లో టీడీపీ, వైఎస్సార్‌సీపీ తరపున ఒక్కొక్క నామినేషన్, స్వతంత్ర అభ్యర్థి నుంచి ఒక నామినేషన్ నమోదైనట్లు పేర్కొన్నారు. మిగిలిన రాజకీయ పార్టీల నుంచి నామినేషన్లు దాఖలు కాలేదు.

దుర్గమ్మకు పట్టువస్త్రాల సమర్పణ

-మొదటిపేజీ తరువాయి

పాలకమండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో వి.కె.శీనానాయక్‌లు ముఖ్యమంత్రి దంపతులకు శేషవస్త్రాలు, అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు.
రాష్ట్ర ప్రజలందరికీ దసరా శుభాకాంక్షలు..
అమ్మవారిని దర్శించుకున్న అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరికీ దసరా శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు పడి, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని దుర్గమ్మను ప్రార్థించానన్నారు.

దేశంలో తొలి ప్రీపెయిడ్ ఫ్యామిలీ ప్లాన్‌ను ప్రవేశపెట్టిన వీ


విజయవాడ, మహానగర్



టెలికాం రంగంలో కొత్త ఆవిష్కరణకు తెరతీస్తూ వొడాఫోన్ ఐడియా (వీ) భారతదేశంలోనే తొలి ప్రీపెయిడ్ ఫ్యామిలీ ప్లాన్‌ను ప్రవేశపెట్టింది. 'వీ పే సబ్ హైన్ వీఐపీ' ఆలోచనతో రూపొందించిన ఈ ప్లాన్ ద్వారా వినియోగదారులు దేశంలోని వివిధ టెలికాం సర్కిళ్లలో ఉన్న కుటుంబ సభ్యులతో డేటాను పంచుకోవడంతోపాటు రీఛార్జీలపై ప్రత్యేక రాయితీలు పొందవచ్చు. యాక్టివ్ ప్రీపెయిడ్ సబ్‌స్క్రైబర్లు వీ యాప్‌లో ఒక ప్రైమరీ సభ్యుడు, ముగ్గురు సెకండరీ సభ్యులతో కుటుంబ గ్రూపును ఏర్పాటు చేసుకోవచ్చు. ప్రతి సభ్యుడు తమ సొంత ప్రీపెయిడ్ ప్లాన్, వ్యాలిడిటీని కొనసాగిస్తూనే అవసరమైనప్పుడు ఒకేసారి 500 ఎంబీ డేటాను ఇతర సభ్యులతో పంచుకోవచ్చు. వీ యాప్ ద్వారా చేసే ప్రతి రీఛార్జీపై కుటుంబ సభ్యులందరికీ 10 శాతం వరకు గ్యారెంటీ డిస్కౌంట్ లభిస్తుంది. ఈ ప్లాన్ ప్రీపెయిడ్ సేవలను మరింత సులభతరం చేస్తుందని వీ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ అవ్నీశ్ ఖోస్లా తెలిపారు. బాలీవుడ్ నటుడు షారుక్ ఖాన్‌తో రూపొందించిన ప్రచార కార్యక్రమం ద్వారా ఈ ప్లాన్ ప్రత్యేకతలను సంస్థ ప్రజల్లోకి తీసుకెళ్తోంది.

స్విగ్గీలో మల్టీ రెస్టారెంట్ ఆర్డరింగ్ సేవలు ప్రారంభం

విజయవాడ, మహానగర్



పండగల సీజన్‌లో వినియోగదారులకు మరింత సౌకర్యవంతమైన ఆహార సేవలు అందించేందుకు స్విగ్గీ తన యాప్‌లో మల్టీ రెస్టారెంట్ ఆర్డరింగ్ ఫీచర్‌ను ప్రారంభించింది. ఈ సదుపాయం ద్వారా వినియోగదారులు ఐదు రెస్టారెంట్ల వరకు తమకు నచ్చిన వంటకాలను ఎంపిక చేసుకుని, ఒకే చెల్లింపుతో ఆర్డర్ చేయవచ్చు. కుటుంబ సమావేశాలు, దీపావళి వేడుకలు, వారాంతపు విందుల సమయంలో వ్యక్తిగత అభిరుచులకు అనుగుణంగా వివిధ రకాల వంటకాలను ఎంచుకునేందుకు ఈ ఫీచర్ ఉపయోగపడుతుంది. వినియోగదారులు వేర్వేరు కార్టులను రూపొందించడం, వాటిని పక్కపక్కన పోల్చడం, ఒకే చెక్‌అవుట్ ద్వారా చెల్లించడం, అన్ని ఆర్డర్లను ఒకే ట్రాకింగ్ స్క్రీన్‌పై పర్యవేక్షించడం చేయవచ్చు. ప్రతి రెస్టారెంట్‌లో ఆహారం విడివిడిగా తయారై స్వతంత్రంగా డెలివరీ అవుతుంది. స్విగ్గీ ఫుడ్ మార్కెట్‌ప్లేస్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ సిద్ధార్థ్ భాకూ మాట్లాడుతూ, వినియోగదారులు తమకు ఇష్టమైన రెస్టారెంట్లు, వివిధ వంటకాల మధ్య ఎంపిక చేసుకునే స్వేచ్ఛను ఈ సేవ కల్పిస్తుందని తెలిపారు. స్విగ్గీ పరిశోధన ప్రకారం, 55 శాతం మంది వినియోగదారులు ఒకే సెషన్‌లో రెండు కార్టులను రూపొందిస్తున్నారు. ఈ ఫీచర్‌ను దేశవ్యాప్తంగా 720కి పైగా నగరాల్లో అందుబాటులోకి తెచ్చినట్లు సంస్థ వెల్లడించింది.

ఎన్జీవో హోమ్‌లు ఉద్యోగుల దేవాలయాలు

75 ఏళ్లుగా ఉద్యోగుల సేవలో ఎన్జీవోల సంఘం

సమస్యల పరిష్కారంలో రాజీపడే ప్రసక్తే లేదు

రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్

అనకాపల్లి, మహానగర్



రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎన్జీవో హోమ్‌లు ఉద్యోగుల దేవాలయాలని, ఆంధ్రప్రదేశ్ ఎన్జీవోల సంఘం గత 75 ఏళ్లుగా ఉద్యోగుల సంక్షేమం కోసం విశేష సేవలందిస్తోందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ అన్నారు. పట్టణంలో శుక్రవారం జరిగిన ఎన్జీవో హోమ్ ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎన్జీవో హోమ్‌లు కేవలం సంఘ భవనాలు మాత్రమే కాకుండా ఉద్యోగుల ఉద్యమాలు, సమావేశాలు, సమస్యల పరిష్కారానికి కేంద్రాలుగా నిలుస్తున్నాయని తెలిపారు. ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, పెన్షనర్లు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఈ భవనాలు సేవలందిస్తున్నాయని, ఆర్థికంగా వెనుకబడిన వారికి వీలైనంత వరకు ఉచిత సేవలు అందించాలని సూచించారు. సంఘంలో యువతకు 30 శాతం అవకాశాలు కల్పించామని పేర్కొన్నారు. ఉద్యోగులు, పెన్షనర్లు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సమస్యల పరిష్కారంలో రాజీపడబోమని స్పష్టం చేశారు. సంఘం ప్రధాన కార్యదర్శి డి.వి. రమణ మాట్లాడుతూ ఉద్యోగుల ఆరోగ్య కార్డులు, వైద్య సేవల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, పెన్షనర్లకు అదనపు పెన్షన్ మంజూరులోనూ సంఘం కృషి చేసిందని తెలిపారు. జిల్లా అధ్యక్షుడు రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర నాయకులకు ఘన స్వాగతం పలికారు. ఉద్యోగులు బైక్ ర్యాలీ నిర్వహించగా, బాణసంచా, మహిళల నృత్యాలతో సందడి నెలకొంది. రాష్ట్ర నాయకులు శిలాఫలకాలను ఆవిష్కరించి, జిల్లా ఎన్జీవోల సంఘం యూట్యూబ్ ఛానల్‌ను ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో పీఆర్సీ, ఆరోగ్య కార్డుల కింద ప్రత్యక్ష చెల్లింపులు, పెన్షనర్ల అదనపు పెన్షన్, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్, సరెండర్ లీవ్ తదితర అంశాల్లో సంఘం చేసిన కృషిని వక్తలు ప్రశంసించారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, మహిళా విభాగం నాయకులు పాల్గొన్నారు.

ఐసీఐసీఐ లైఫ్ ఇన్సూరెన్ నారీశక్తి కార్యక్రమం కింద


20 వేల మంది మహిళా సలహాదారుల నియామకం

గుంటూరు, మహానగర్

మహిళా సాధికారతకు ప్రాధాన్యమిస్తూ ఐసీఐసీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ 2027 ఆర్థిక సంవత్సరం నాటికి దేశవ్యాప్తంగా 20 వేల మంది మహిళా సలహాదారులను నియమించుకోనున్నట్లు ప్రకటించింది. నవరాత్రి సందర్భంగా 'నారీశక్తి' కార్యక్రమం కింద ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. సెప్టెంబర్ 30, 2026 నాటికి సంస్థలో 78 వేలకు పైగా మహిళా సలహాదారులు సేవలందిస్తుండగా, కంపెనీ ఏజెన్సీ వ్యాపారంలో మహిళల వాటా 45 శాతంగా ఉంది. సంస్థ చీఫ్ డిస్ట్రిబ్యూషన్ ఆఫీసర్ అమీష్ బ్యాంకర్ మాట్లాడుతూ, ప్రతిభకు లింగభేదం లేదని, వినియోగదారుల అవసరాలను గుర్తించి తగిన బీమా పరిష్కారాలను సూచించడంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. బెంగళూరు, కేరళ, ముంబై వంటి ప్రాంతాల్లో మహిళా సలహాదారుల వాటా 50 శాతాన్ని మించిందన్నారు. రెండేళ్ల క్రితం ప్రారంభించిన నారీశక్తి కార్యక్రమం ద్వారా మహిళలకు ప్రత్యేక శిక్షణ, అవసరమైన సహకారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళా సలహాదారుల్లో 47 శాతం మంది పదేళ్లకు పైగా సంస్థతో అనుబంధం కలిగి ఉండగా, 500 మందికి పైగా ఎండీఆర్‌టీ అర్హత సాధించారు. ఎలాంటి ముందస్తు పెట్టుబడి అవసరం లేకుండా మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు, వృత్తిపరంగా ఎదిగేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతోందని సంస్థ వెల్లడించింది.

కాంగ్రెస్ పతనానికి రాహుల్ గాంధీ నాయకత్వమే కారణమా?

విజయవాడ, మహానగర్



కాంగ్రెస్ పార్టీ వరుస ఎన్నికల పరాజయాలు, నాయకత్వ వైఫల్యాలు రాజకీయంగా ఆ పార్టీ భవిష్యత్తుపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని రాజకీయ విశ్లేషణ పేర్కొంది. ఎన్నికల్లో ఓటములకు దారితీసిన వ్యూహాత్మక లోపాలను అంగీకరించి ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన కాంగ్రెస్ నాయకత్వం, అందుకు బదులుగా ఇతరులపై ఆరోపణలు చేస్తోందని విమర్శించింది. రాహుల్ గాంధీ నాయకత్వంలో పార్టీ ఎన్నికల పరాజయాలను ఎదుర్కొంటుండగా, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యూహాలతో బీజేపీ తన రాజకీయ ప్రాబల్యాన్ని విస్తరించుకుందని పేర్కొంది. గుజరాత్ నుంచి బెంగాల్ వరకు, త్రిపుర నుంచి రాజస్థాన్ వరకు కాంగ్రెస్ ప్రభావం తగ్గిందని విశ్లేషించింది. ఎన్నికల పతనం 2024 తర్వాత ప్రారంభమైన ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియకు ముందే మొదలైందని, అయినప్పటికీ రాహుల్ గాంధీ ఆ ప్రక్రియను వ్యతిరేకిస్తున్నారని పేర్కొంది. బీహార్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లో కాంగ్రెస్ తన పూర్వ వైభవాన్ని తిరిగి సాధించేందుకు దీర్ఘకాలంగా ప్రయత్నిస్తోందని తెలిపింది. 2029 సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ భారీ మెజారిటీతో తిరిగి అధికారంలోకి వస్తుందని అమిత్ షా అంచనా వేసిన నేపథ్యంలో, బీజేపీ బలానికి మోదీ నాయకత్వం, దీర్ఘకాలిక రాజకీయ దార్శనికత, సంస్థాగత సామర్థ్యమే ప్రధాన కారణాలని విశ్లేషణ పేర్కొంది. ఎన్నికల పరాజయాల నుంచి పాఠాలు నేర్చుకోవడం ప్రతి రాజకీయ పార్టీకి అవసరమని స్పష్టం చేసింది.

రాష్ట్రాన్ని జంగిల్‌రాజ్‌గా మార్చేశారు

-మొదటిపేజీ తరువాయి

చట్టపరంగా పోరాటం చేస్తాం

రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయాలను సమర్థంగా ఎదుర్కొంటామని వైఎస్ జగన్ స్పష్టంచేశారు. న్యాయపరంగా, చట్టపరంగా అన్ని మార్గాల్లో పోరాటం చేస్తామని, ధైర్యం, సహనంతో ఎన్నికలను ఎదుర్కొంటామని తెలిపారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను న్యాయస్థానాల దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరగాలంటే పారామిలటరీ బలగాలను మోహరించాల్సిన అవసరం ఉందని వైఎస్ జగన్ అభిప్రాయపడ్డారు. ఇదే అంశాన్ని న్యాయస్థానాల ముందు ఉంచుతామని తెలిపారు. ప్రజలకు మంచి చేసిన చరిత్ర వైఎస్సార్‌సీపీదని, హింసతో రాష్ట్రాన్ని నాశనం చేస్తున్న చరిత్ర చంద్రబాబుదని వైఎస్ జగన్ విమర్శించారు.

కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ఉమ్మడి కార్యాచరణ

పోటీ చేసే స్థానాలపై టీడీపీ, జనసేన, బీజేపీ నేతల కసరత్తు

మూడు పార్టీల మధ్య సమన్వయం, పరస్పర సహకారంపై కీలక చర్చలు



విజయవాడ, మహానగర్:

రానున్న ఎన్నికల్లో పోటీ చేసే స్థానాలు, అనుసరించాల్సిన వ్యూహాలపై నగరంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ముఖ్య నాయకులు శుక్రవారం కీలక సమావేశం నిర్వహించారు. కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా మూడు పార్టీల నాయకులు సమాలోచనలు జరిపారు. ఏ స్థానంలో ఏ పార్టీ అభ్యర్థి పోటీ చేసినా, ఆయనను కూటమి అభ్యర్థిగా పరిగణించి మిగిలిన రెండు పార్టీల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు. కూటమి ఐక్యతను మరింత బలోపేతం చేస్తూ పోటీ చేసే ప్రతి స్థానంలో విజయానికి సమష్టిగా కృషి చేయాలని నాయకులు అభిప్రాయపడ్డారు. మూడు పార్టీల మధ్య పరస్పర సహకారం, సమన్వయం కీలకమని, క్షేత్రస్థాయిలో నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేస్తే ఆశించిన ఫలితాలు సాధించవచ్చని చర్చించారు. స్థానాల వారీగా అనుసరించాల్సిన వ్యూహాలు, ఉమ్మడి కార్యాచరణపై కసరత్తు చేశారు. ఈ సమావేశంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గద్దె అనురాధ, వంగవీటి రాధా, మక్కెన మల్లికార్జునరావు, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బోండా ఉమా, బీజేపీ స్టేట్ హెడ్‌క్వార్టర్స్ ఇన్‌చార్జి ఉప్పలపాటి శ్రీనివాసరాజు, మాజీ ఎమ్మెల్సీ సత్యనారాయణ రాజు, బీజేపీ మైనారిటీ నాయకుడు షేక్ బాజీ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి, మాజీ ఎమ్మెల్యేలు జలీల్ ఖాన్, సామినేని ఉదయభాను, టీడీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి బుద్ధా వెంకన్న, జనసేన నాయకుడు అమ్మిశెట్టి వాసు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు. కూటమి ఐక్యత, సమన్వయం, ఉమ్మడి కార్యాచరణతో ముందుకు సాగాలని నాయకులు నిర్ణయించారు.

ఘనంగా శ్రీదేవి శరన్నవరాత్రి వేడుకలు



నాగాయలంక, మహానగర్

శ్రీదేవి శరన్నవరాత్రి వేడుకల్లో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పాల్గొన్నారు. గ్రామంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి సమన్విత పార్వతి సమేత నగరేశ్వర స్వామి వారి దేవాలయంలో శుక్రవారం మూలా నక్షత్రం సందర్భంగా అమ్మవార్లను కమిటీ ఆధ్వర్యంలో సరస్వతి దేవిగా అలంకరించారు. ఆలయ అర్చకులు కొల్లిపర సుబ్బారావు పూజలు చేశారు. మహిళలు సామూహిక కుంకుమ పూజ, విద్యార్థినీ, విద్యార్థులచే సరస్వతి పూజ చేయించారు. కమిటీ ప్రతినిధుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ఈ ఉత్సవాల్లో పాల్గొని స్వామివారిని, అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షులు చిట్టా సాంబశివరావు అయనను సత్కరించగా, అర్చకులు స్వామివారి ఆశీస్సులు అందచేశారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి తరలివచ్చిన విద్యార్థులకు కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చేతులమీదుగా నోట్ పుస్తకాలు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో ప్రముఖులు బండ్రెడ్డి వెంకటేశ్వరరావు, ఆలయ కమిటీ పెద్దలు చిట్టా వీర అన్నపూర్ణయ్య, చిట్టా శివ నాగేశ్వరరావు, తాడికొండ సత్యనారాయణ, మునగాల మోహనరావు, చిట్టా హరేకృష్ణ పాల్గొన్నారు.

భక్తులకు అందుతున్న సేవలను పరిశీలించిన ఎంపీ కేశినేని చిన్ని

ఇంద్రకీలాద్రి, మహానగర్



సరస్వతీ దేవి అలంకారంలో దర్శనమిస్తున్న శ్రీ కనకదుర్గమ్మవారిని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) దంపతులు శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలకగా, వేద పండితులు ఆశీర్వచనం అందించి అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయంలో భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను ఎంపీ స్వయంగా పరిశీలించారు. క్యూ లైన్లలోని భక్తులతో నేరుగా మాట్లాడి దర్శనానికి పడుతున్న సమయం, తాగునీరు తదితర సౌకర్యాలపై ఆరా తీశారు. చిన్నారులు, వృద్ధులకు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ స్వయంగా వేడి పాలు పంపిణీ చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. భక్తుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించి, అత్యవసర సమయాల్లో తక్షణ వైద్య సహాయం అందించాలని సిబ్బందికి సూచించారు. ఆలయ పరిసరాల్లో భద్రతా ఏర్పాట్లపై పోలీసు అధికారులతో చర్చించి, భక్తుల రద్దీకి అనుగుణంగా భద్రతా చర్యలు చేపట్టాలని, క్యూ లైన్ల నిర్వహణలో సమన్వయంతో వ్యవహరించాలని కోరారు. ఈ సందర్భంగా వేద విద్య అభ్యసిస్తున్న చిన్నారులతో ఆప్యాయంగా ముచ్చటించి, వారి అధ్యయన వివరాలను తెలుసుకున్నారు. భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు మెరుగైన సౌకర్యాలు, సురక్షిత వాతావరణం కల్పించడమే లక్ష్యంగా సేవలు, వైద్య సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించినట్లు తెలిపారు.

మన సాంస్కృతిక వైభవానికి ప్రతీక..

విజయవాడ ఉత్సవ్ 2.0

'దసరా అంటే విజయవాడ' అనే గుర్తింపు రావాలి : డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు





విజయవాడ, మహానగర్

కనకదుర్గమ్మ పాదాల చెంత పది రోజుల పాటు రెండు ప్రాంగణాల్లో వేలాది మంది ప్రజలు, వందలాది మంది కళాకారుల భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న విజయవాడ ఉత్సవ్ 2.0 నగర సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలుస్తోందని శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు అన్నారు. ఉత్సవంలో భాగంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు, కళా ప్రదర్శనలు, జాతీయ స్థాయి సరస్ మేళా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయని ప్రశంసించారు. ఢిల్లీకే పరిమితమైన జాతీయ సరస్ మేళాను విజయవాడకు తీసుకురావడం గొప్ప విజయమని, దీని ద్వారా దేశంలోని వివిధ ప్రాంతాల హస్తకళాకారులు, గ్రామీణ ఉత్పత్తిదారులు, స్వయం సహాయక సంఘాల మహిళలకు తమ ఉత్పత్తులను ప్రదర్శించి విక్రయించుకునే అవకాశం లభించిందని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు మహిళా సాధికారతకు, స్థానిక ఉపాధి అవకాశాల పెంపునకు, చిన్న వ్యాపారాల అభివృద్ధికి దోహదపడతాయన్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి ఉత్సవాన్ని మరింత వైభవంగా నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఒకప్పుడు దసరా అంటే మైసూరు దసరా, గుజరాత్ డాండియా ఉత్సవాలు గుర్తుకొచ్చేవని, భవిష్యత్తులో దేశవ్యాప్తంగా 'దసరా అంటే విజయవాడ' అనే గుర్తింపు వచ్చేలా నగరం ఎదగాలని ఆకాంక్షించారు. సాంస్కృతిక



ఉత్సవాలు పర్యాటక రంగ అభివృద్ధికి, స్థానిక కళాకారులకు ప్రోత్సాహానికి దోహదపడతాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ, సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ ఆధ్వర్యంలో పక్కా ప్రణాళిక, సమన్వయంతో ఉత్సవాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న నిర్వాహకులు, అధికారులు, కళాకారులు, ప్రజలను అభినందించారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో తమిళనాడు రాజ్యసభ సభ్యుడు ఎల్.కె. సుదీష్, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) సతీమణి జానకి లక్ష్మి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

గాంధీ శిల్ప బజార్‌కు విశేష స్పందన

దేశవ్యాప్తంగా సంప్రదాయ కళారూపాలు, చేనేత ఉత్పత్తులకు ఆదరణ

70 మంది కళాకారులతో విభిన్న హస్తకళా ఉత్పత్తుల ప్రదర్శన

ఈ నెల 18 వరకు కొనసాగనున్న గాంధీ శిల్ప బజార్


కళాకారులకు మార్కెటింగ్ వేదికగా లేపాక్షి ప్రదర్శన

నేరుగా వినియోగదారులకు ఉత్పత్తుల విక్రయం









విజయవాడ, మహానగర్

సంప్రదాయ హస్తకళలు, చేనేత ఉత్పత్తులకు ప్రోత్సాహం అందించడంతో పాటు కళాకారులకు విస్తృత మార్కెటింగ్ అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ లిమిటెడ్ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహిస్తున్న గాంధీ శిల్ప బజార్‌కు విశేష స్పందన లభిస్తోంది. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు రూపొందించిన విభిన్న కళాకృతులు, చేనేత ఉత్పత్తులు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. దసరా పండుగ నేపథ్యంలో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శన ఈ నెల 18వ తేదీ వరకు కొనసాగనుంది. ఎన్‌టీఆర్ సర్కిల్ సమీపంలోని పంటకాలవ రోడ్డులో ఉన్న మారిస్ స్టెల్లా ఇండోర్ స్టేడియంలో గత వారం రోజులుగా ఈ ప్రదర్శన నిర్వహిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, రాజస్థాన్, గుజరాత్, పశ్చిమ బెంగాల్, అస్సాం, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన సుమారు 70 మంది హస్తకళాకారులు, చేనేత కళాకారులు తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారు. కొండపల్లి, ఏటికొప్పాక బొమ్మలు, కలంకారీ కళారూపాలు, చెక్క శిల్పాలు, టెర్రకోట ఉత్పత్తులు, తోలుబొమ్మలు, క్రోషియా లేస్, ఇమిటేషన్ ఆభరణాలు, వెంకటగిరి చీరలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. తెలంగాణ లక్క గాజులు, పోచంపల్లి ఇకత్ చీరలు, కర్ణాటక చన్నపట్నం బొమ్మలు, కొల్హాపురి చెప్పులు, ఉత్తరప్రదేశ్ జరీ, చికన్‌కారీ వస్త్రాలు, అస్సాం వెదురు, కేన్ ఉత్పత్తులు సహా పలు ప్రాంతాల ప్రత్యేక కళాకృతులు సందర్శకులకు అందుబాటులో ఉన్నాయి. కళాకారులు తమ చేతులతో తయారు చేసిన ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు విక్రయించే అవకాశం కల్పించడం ద్వారా వారి ఆదాయ వృద్ధికి, మార్కెట్ విస్తరణకు ఈ ప్రదర్శన దోహదపడుతోంది.



వినియోగదారులు వివిధ ప్రాంతాల సంప్రదాయ కళలు, చేనేత ఉత్పత్తులను ఒకే వేదికపై వీక్షించి కొనుగోలు చేయగలుగుతున్నారు. హస్తకళాకారులకు శిక్షణ, డిజైన్ అభివృద్ధి, ఆధునిక పనిముట్ల పంపిణీతో పాటు మార్కెటింగ్ అవకాశాల కల్పనకు లేపాక్షి ప్రాధాన్యమిస్తోందని ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ-- లేపాక్షి చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ తెలిపారు. సంప్రదాయ హస్తకళలు, చేనేత రంగాల అభివృద్ధికి ఇటువంటి ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయని, కళాకారుల నైపుణ్యంతో రూపొందిన ఉత్పత్తులకు విస్తృత ప్రచారం కల్పించడం ద్వారా వారి ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచవచ్చని పేర్కొన్నారు. భారతీయ సంప్రదాయ కళా వైభవాన్ని భావితరాలకు అందించడంతో పాటు కళాకారులను ప్రోత్సహించేందుకు లేపాక్షి నిరంతరం కృషి చేస్తోందన్నారు. ప్రజలు గాంధీ శిల్ప బజార్‌ను సందర్శించి హస్తకళలు, చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా కళాకారులకు అండగా నిలవాలని హరిప్రసాద్ కోరారు.

గిగ్ వర్కులుగా మారుతున్న యూత్

ప్రతి సంవత్సరం కొన్ని లక్షలు మంది డ్రిగీ పట్టాలతో బయటికొస్తున్నారు. ఇందులో కొందరు మాత్రమే మంచి ఉద్యోగాలు సాదించి ఉన్నత స్థాయికి చేరుకుంటున్నారు. కానీ ఇలా డిగ్రీ పట్టా చేతితో పట్టుకొని.. సరైన ఉద్యోగ అవకాశాలు దొరక్కా.. ఎంతో మంది పార్ట్‌టైం జాబ్‌గా ఫుడ్ డెలివరీ జాబ్స్‌కు పరిమితమవుతున్నారు. ఇలాంటి వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతూనే ఉంది.. మరీ ఇది వారి జీవితాన్ని ఎలా ప్రభావితం చేస్తుంది. కళాశాల నుంచి డిగ్రీ పట్టాతో ప్రతి ఏడాది కొన్ని లక్షల మంది యువత బయటకు వస్తున్నారు. ఇలా బయటకొచ్చిన ఓ గ్రాడ్యుయేట్ ఓ సాధారణ రెజ్యూమెతో ఉద్యోగాల కోసం వెతుక్కుంటూ.. సరైన జాబ్ దొకకా తర్వాతి అడుగు ఎటు వేయాలో తెలియని అయోమయంలో పడిపోతుననారు. చివరికి అద్దె బైక్‌పై ఫుడ్ డెలివరీ చేస్తూ, రోజూవారీ ఖర్చులు వెళ్లదీసుకుంటూ, ఎప్పటికైనా తాను చదివిన చదువుకు తగిన ఉద్యోగం లభిస్తుందనే ఆశతో ఎదురుచూస్తూ జీవితాన్ని గడిపేస్తున్నారు. మన దేశంలో ఏటా లక్షలాది మంది యువతీ, యువకులు ఎదుర్కొంటున్న ఈ చదువు పూర్తి కావడానికి ? సరైన ఉపాధి దొరకడానికి మధ్య ఉండే ఖాళీ వ్యవస్థలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.అనేక అభివృద్ధి చెందిన దేశాల్లో ఈ పరివర్తన కాలాన్ని అనుకోకుండా వదిలేయకుండా, ఒక పద్ధతి ప్రకారం డిజైన్ చేశారు. ముఖ్యంగా జర్మనీలో అమలవుతున్న డ్యూయల్ అప్రెంటిస్‌షిప్ విధానం ప్రపంచానికే రోల్ మోడల్‌గా నిలుస్తోంది. అక్కడ విద్యార్థులు సగం సమయం తరగతి గదిలో, మిగిలిన సగం వాస్తవ పని ప్రదేశంలో గడుపుతూ వేతనం పొందుతారు. సుమారు 8.3 కోట్ల జనాభా ఉన్న జర్మనీలో దాదాపు 13 లక్షల మంది అప్రెంటిస్‌లుగా ఉన్నారు. అంటే వారి మొత్తం జనాభాలో వీరు 1.5 శాతానికి పైగా ఉంటారు.భారత్‌లోనూ దీనికి సమానంగా నేషనల్ అప్రెంటిస్‌షిప్ ప్రమోషన్ స్కీమ్ ఉంది. కానీ ఇక్కడి గణాంకాలు ఇందుకు పూర్తి భిన్నంగా ఉన్నాయి. 140 కోట్లకు పైగా జనాభా ఉన్న మన దేశంలో, 2024?25 ఆర్థిక సంవత్సరంలో ఈ పథకం కింద నమోదైన అప్రెంటిస్‌ల సంఖ్య కేవలం 9.85 లక్షలు మాత్రమే. అంటే జనాభా నిష్పత్తి ప్రకారం చూస్తే జర్మనీ కంటే ఇది దాదాపు 20 రెట్లు తక్కువ.ఇక్కడ ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. అవకాశాలు లేకపోవడం సమస్య కాదు. అధికారిక నివేదికల ప్రకారం, దేశవ్యాప్తంగా అప్రెంటిస్‌షిప్ పథకం కింద ఏకంగా 70 లక్షలకు పైగా ఖాళీలు భర్తీ కాకుండా మిగిలిపోయాయి. సమస్య ఖాళీల కొరత కాదు, యువత వీటి కోసం దరఖాస్తు చేయకపోవడమే. 2022లో 42.8 లక్షలుగా ఉన్న దరఖాస్తులు, 2025 నాటికి ఏకంగా 4 లక్షలకు పడిపోవడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది.చదువు నుంచి కెరీర్‌కు వారధిగా నిలవాల్సిన లక్షలాది పోస్టులను నిరుద్యోగ యువత ఎందుకు ఎంచుకోవడం లేదు? అనే విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తే.. దీని వెనుక బలమైన ఆర్థిక కారణాలు కనిపిస్తున్నాయి. అప్రెంటిస్‌షిప్‌లలో సాధారణంగా నెలకు రూ.10,000 నుంచి రూ.15,000 వరకు మాత్రమే స్టైపెండ్ ఇస్తారు. దీనికోసం వేరే నగరాలకు వెళ్లి అక్కడే ఉండాలి.. పైగా ట్రైనింగ్ తర్వాత ఉద్యోగం వస్తుందన్న గ్యారెంటీ ఉండదు. దీంతో చాలా మంది దీనివైపు మొగ్గుచూపట్లేదని నివేదికలు చెబుతున్నారు.అదే సమయంలో దీనికి భిన్నంగా ఫుడ్ డెలివరీ, క్యాబ్ డ్రైవింగ్, రిటైల్ స్టోర్లలో పని వంటి గిగ్ ఉద్యోగాలు వెంటనే డబ్బును అందిస్తున్నాయి. సొంత ఊరిలోనే ఉంటూ పనిచేసుకునే వెసులుబాటు ఉండటం, దీర్ఘకాలిక ఒప్పందాలు లేకపోవడంతో కుటుంబ అవసరాలు తీర్చుకోవాల్సిన యువత అప్రెంటిస్‌షిప్ కంటే గిగ్ పనులకే మొగ్గు చూపుతున్నారు.గిగ్ వర్క్ తాత్కాలిక ఆదాయానికి, ఉపాధికి మంచి మాధ్యమమే అయినప్పటికీ.. ఇది భవిష్యత్తులో అధిక వేతనాలు, స్థిరమైన కెరీర్‌ను ఇచ్చే సర్టిఫైడ్ నైపుణ్యాలను అందించలేదు. అదే క్రమబద్ధమైన అప్రెంటిస్‌షిప్ అయితే తరగతి గది పాఠాలను పరిశ్రమ అవసరాలకు అనుసంధానించే నైపుణ్యాన్ని ఇస్తుంది. కానీ ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో శిక్షణ ద్వారా కెరీర్‌ను నిర్మించుకోవడం కంటే, చేతికి వెంటనే డబ్బు తెచ్చిపెట్టే తాత్కాలిక పనుల వైపే భారతీయ యువత అడుగులు వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.యువత తీసుకుంటున్న ఈ నిర్ణయం వారి ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా సరైనదే కావొచ్చు. కానీ లక్షలాది ఖాళీలు అందుబాటులో ఉన్నా, ఒక క్రమబద్ధమైన శిక్షణా విధానాన్ని యువత ఎందుకు కాదనుకోవాల్సి వస్తుందన్నదే అసలు ప్రశ్న. వ్యవస్థాగత విధానాలు, స్టైపెండ్ స్థాయిలు, భవిష్యత్ ఉద్యోగ భద్రత వంటి అంశాలలో మార్పులు రానంత వరకు ఈ అంతరం ఇలాగే కొనసాగే ప్రమాదం ఉంది.

తిరగబడిన సింగరేణి



నల్లబంగారంలో మంటలు రగులుతున్నాయి. ఆగ్రహ శిఖరాలు పగులుతున్నాయి. మాటతప్పిన, మడమతిప్పిన సర్కార్‌పై నిప్పురవ్వలు ఎగురుతున్నాయి. తెలంగాణ జీవనాడి తెగించి పోరుకు సిద్ధమవుతున్నది. బొగ్గును తవ్వితీసే చేతులు పిడికిళ్లు ఎత్తుతున్నాయి. సింగరేణి కార్మికలోకం ఏకవ్యక్తిగా రూపుదాల్చి సవాల్ చేస్తున్నది. సింగరేణి సభలో ప్రతిధ్వనించింది కేటీఆర్ గొంతు కాదు, అశేష కార్మికుల పొలికేక. బహువచనం ఏకవచనమైన నినాదం. సమర సన్నద్ధమైన కార్మికలోకం సమరనాదం. గనుల పొరల్లో నుంచి మార్మోగుతున్న ప్రశ్నలు. ఇందుకు సర్కార్ దగ్గర జవాబులు ఉన్నాయా? తెలంగాణ తల్లి సిరులవేణి సింగరేణిలో అలజడికి బీఆర్ఎస్ సభ నిలువుటద్దం పట్టింది. అధికారంలో ఉన్నా లేకున్నా బొగ్గుబాయి గుండెల్లో రెపరెపలాడేది గులాబీ జెండానే అని చాటిచెప్పింది. ఆ అనుబంధం ఈనాటిది కాదు. నాడు తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగసిపడినప్పుడు సింగరేణి కేసీఆర్ సైన్యమై కదం తొక్కింది. నేడు కాంగ్రెస్ సర్కార్ మోసాలు, ద్రోహాలతో కలవరపడుతున్న కార్మికులకు 'నేనున్నాను తోడుగా' అని అండగా నిలిచింది బీఆర్ఎస్. రెట్టించిన సమరోత్సాహంతో జూలు విదిల్చింది సింగరేణి. సింహమై గర్జించింది సింగరేణి. ఆ గర్జనకు గొంతు కలిపారు కేటీఆర్. సింగరేణి అంటే చిన్నాచితకా కంపెనీ కాదు. భూగర్భంలో ప్రాణాలను పణంగా పెట్టి బొగ్గును వెలికితీసే కార్మికుల స్వేద శిఖరం. అలాంటి కార్మికుల సమస్యలను సాధారణ ఉద్యోగుల ఫిర్యాదులుగా పరిగణించలేము. వారి భద్రత, వేతనాలు, ఉద్యోగ భద్రత, వైద్య సదుపాయాలు, నివాస వసతులు, కుటుంబాల సంక్షేమం ప్రభుత్వ ప్రాధాన్యాల్లో ఉండాలి. కానీ అలా ఎందుకు లేదు? ఎన్నికల ముందు ఇచ్చిన అడ్డగోలు హామీలు ఏమయ్యాయి. అవి హామీలు కావు, అర్రాసు పాటలు. ఇంతకు ఇంత ఇస్తామనే మాటలు. అవి కోటలు దాటినా అడుగు మాత్రం ముందుకు కదల్లేదు. కార్మికుల సొంతింటి కల నిజం చేస్తామన్నారు. ప్రతి కార్మికుడికి 250 గజాల ఇంటి స్థలం, 20 లక్షల వడ్డీలేని రుణం ఇస్తామన్నారు. ఇచ్చారా? కారుణ్య నియామకాలను సరళీకృతం చేస్తామని చెప్పారు. చేశారా? లాభాల్లో మెరుగైన వాటా ఇస్తామన్నారు. ఆచరణలో తగ్గించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కార్మికుల సమస్యలపై గళమెత్తి, అధికారంలోకి వచ్చాక ఆ సమస్యలను అటకెక్కించారు. మోసపోయి గోసపడుతున్న సింగరేణి శ్రామికలోకం తరపున బీఆర్ఎస్ సభ ప్రశ్నలను సంధించింది. సమాధానాలున్నాయా కాంగ్రెస్ దగ్గర? కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేసి, సింగరేణి నిర్వహణను మెరుగుపర్చడం మాట దేవుడెరుగు, అసలు అస్తిత్వానికే ఎసరు తెస్తున్నారు. లెక్కలు నొక్కేసి బొగ్గును బొక్కేస్తున్నారు. మూడేండ్లలో పది వేల కోట్ల సంపద హాంఫట్ అయిపోయిందని విపక్షం ఆరోపిస్తున్నది. కాంగ్రెస్ పాలనలో సింగరేణిలో స్కాములు ఎగసిపడుతున్నా బీజేపీ నోరు మెదపదు. అంతా కాటాకుస్తీ. ఈ దొందూదొందే సింగరేణి నల్లవజ్రాలను అంబానీ, అదానీలకు పప్పుబెల్లాల్లా పంచిపెట్టాలని చూస్తున్నది. ఎట్టిపరిస్థితుల్లో ప్రైవేటీకరణ జరుగనివ్వబోమని గొప్పగా హామీ ఇచ్చిన కాంగ్రెస్ లోపల్లోపల కుట్రలు పన్నుతున్నది. ఆ కుట్రలకు ముసిముసి నవ్వులతో వత్తాసు పలుకుతున్నది బీజేపీ. ఈ దొందూదొందేపై కేటీఆర్ ఎక్కుపెట్టిన విమర్శలపై సమాధానాలు ఉన్నాయా కాంగ్రెస్ దగ్గర? రూ.నాలుగున్నర లక్షల కోట్లు అప్పుచేశామని చెప్తున్న సర్కార్ రూ.60 వేల కోట్లు సింగరేణి బకాయిలు తీర్చలేకపోయింది. కరెంటు ఏమైందంటే బొగ్గు లేదంటున్నారు. బొగ్గు ఏమైందంటే సింగరేణి వైపు వేలెత్తి చూపిస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో 70 మిలియన్ టన్నుల ఉత్పత్తి ఓ రికార్డు. 2025-26లో 58 మిలియన్ టన్నులే. రానురాను పెరగాల్సింది తరిగిపోవడం ఏమిటి? చేతగాని, చేవలేని పాలన ఫలితం కాదా ఇది? రామన్న సంధించిన ఈ ప్రశ్నలకు సమాధానాలు ఉన్నాయా కాంగ్రెస్ దగ్గర? సింగరేణి కార్మికుల ఆందోళనలో అత్యంత కీలకమైన అంశం సంస్థ లాభాల్లో వారి వాటా. సంస్థ అభివృద్ధికి కార్మికుల శ్రమే పునాది అయినప్పుడు, ఆర్థిక ఫలితాల్లో వారికి న్యాయమైన వాటా దక్కాలన్న డిమాండ్‌ను కాదనగలమా? కేసీఆర్‌కు ముందు లాభాల్లో వాటా 16 శాతమే. కేసీఆర్ దానిని 32 శాతానికి పెంచారు. ఒక శాతం ఎక్కువే ఇస్తామన్న కాంగ్రెస్ లాభాలు తగ్గించి చూపి బోనస్‌కు కోత పెడుతున్నది. గత ఏడాది రూ.1.95 లక్షలున్న బోనస్ ఈ ఏడాది రూ.1.53 లక్షలకు తగ్గిపోవడమే అందుకు నిదర్శనం. ఈ దోఖాలపై పోరుగడ్డ సింగరేణి నిలదీస్తున్నది. బరిగీసి సర్కార్‌తో కొట్లాడుతామని అంటున్నారు కేటీఆర్. నిలబడే దమ్మున్నదా కాంగ్రెస్ పాలకులకు?

విశ్వగురుపై రగులుతున్న ఇన్వెస్టర్లు



దేశ జీడీపీ 7.8 శాతం వృద్ధి రేటు సాధించినట్టు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నెల క్రితం ప్రకటించారు. ఈ వృద్ధి రేటుతో దేశమంతా సంబురపడుతున్నదని గర్వంగా చెప్పారు. వాస్తవానికి ప్రపంచంలో మరే దేశం సాధించని విధంగా 7.8 శాతం వృద్ధి రేటు సాధించి ఉంటే స్టాక్‌మార్కెట్ రాకెట్‌లా దూసుకువెళ్లి ఉండేది. కానీ అలా జరుగలేదు. స్టాక్‌మార్కెట్ పాతాళానికి దూసుకెళ్తున్నది. ఈనెల 8వ తేదీన ఒక్కరోజే రూ.10.20 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరైంది. వరుసగా ఎనిమిది వారాల పాటు మార్కెట్ మైనస్‌లో ముగియడం 25 ఏండ్ల క్రితం నాటి రికార్డు. ప్రపంచాన్ని కలవరపెట్టిన కరోనా సమయంలో కూడా మార్కెట్ రెండు నెలల్లోపే కోలుకున్నది. కానీ ఇప్పుడు గత రెండేండ్ల నుంచి మార్కెట్ ఎలాంటి లాభాలు ఇవ్వలేదు. ఈ కాలంలో సెన్సెక్స్ 12.12 శాతం మైనస్‌లో ఉన్నది. నిఫ్టీ 11.01 శాతం మైనస్‌లో ఉన్నది. అంటే రూ.లక్ష పెట్టుబడి పెట్టినవారు రెండేండ్ల తర్వాత రూ.12 వేల నష్టంతో ఉన్నట్టు లెక్క. ఈ రెండేండ్ల కాలంలో సెన్సెక్స్ 9,874 పాయింట్లు నష్టపోతే, నిఫ్టీ 2,750 పాయింట్లు కోల్పోయింది. ప్రపంచంలో చివరికి పాకిస్థాన్ స్టాక్ మార్కెట్ కూడా లాభాల బాటలో ఉండగా మన దేశంలోని స్టాక్ మార్కెట్లు కోలుకోవడం లేదు. ఇజ్రాయెల్ మార్కెట్ లాభాల్లో ఉన్నది. అమెరికా మార్కెట్లు సానుకూలంగానే స్పందిస్తున్నాయి. మన దేశంలో మార్కెట్ పతనానికి ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం కారణమని పాలకులు నమ్మబలుకుతున్నారు. బయటి కారణాలతోపాటు మన సొంత కారణాలు కూడా మార్కెట్‌ను దెబ్బతీస్తున్నాయి. స్వల్పకాలిక ఆదాయం, దీర్ఘకాలిక క్యాపిటల్ గెయిన్ టాక్స్ పెంచడంతో మార్కెట్ నడ్డివిరిచినట్టు అయింది. స్టాక్ మార్కెట్‌లో 13.5 కోట్ల మంది ఇన్వెస్టర్లు, మ్యూచువల్ ఫండ్స్‌లో 5.9 కోట్ల మంది ఇన్వెస్టర్లు ఉన్నారు.

స్టాక్ మార్కెట్‌లో ఇన్వెస్ట్ చేసే వాళ్లు కొందరు మ్యూచువల్ ఫండ్స్‌లో కూడా పెట్టుబడి పెడుతారు. దేశంలో మొత్తం ఇన్వెస్టర్ల సంఖ్య సుమారు 15 కోట్ల మంది అనుకుంటే.. 28.35 కోట్ల మ్యూచువల్ ఫండ్స్ ఖాతాలు ఉన్నాయి. ఒక వ్యక్తికి ఒకటికి మించి ఖాతాలు ఉండవచ్చు. మధ్యతరగతికి చెందిన వీరంతా గడచిన రెండేండ్ల నుంచి నష్టాల్లోనే కూరుకుపోయారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావడానికి ఈ మధ్యతరగతే ప్రధాన పాత్ర పోషించారు. స్టాక్ మార్కెట్‌లో రెండేండ్ల నుంచి నష్టాలు చవిచూస్తున్న ఈ వర్గం ఇప్పుడు అసంతృప్తితో రగిలిపోతున్నారు. మధ్యతరగతి వర్గం 15 కోట్ల మంది అంటే ఎన్నికల్లో ఫలితాలు నిర్ణయించే శక్తి ఉన్న వర్గం.

విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు గత రెండేండ్ల నుంచి నిధుల తరలింపును నిరంతరాయంగా కొనసాగిస్తున్నారు. 2025లో రూ.1.66 లక్షల కోట్లు, 2026లో అక్టోబర్ నాటికే రూ.2.92 కోట్లు తరలించారు. ఇంకా రెండు నెలల సమయం ఉన్నది. గత సంవత్సరం కన్నా ఈ సారి రెట్టింపు అమ్మకాలు సాగించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు ఈ స్థాయిలో తరలిస్తే నిజానికి స్టాక్ మార్కెట్ పూర్తిగా కుప్పకూలిపోవాలి. హర్షద్ మెహతా సంక్షోభ సమయంలో పడిపోయినట్టు ఇప్పుడు కూడా పడిపోవాలి. మార్కెట్ కొంతవరకు తట్టుకుని నిలబడిందంటే మన యువ ఇన్వెస్టర్లే కారణం. ఐటీతోపాటు వివిధ ఉద్యోగాల్లో ఉన్న యువత భవిష్యత్తు కోసం నెలనెలా సిప్ ద్వారా పెట్టుబడులు పెడుతున్నారు. భవిష్యత్తులో బాగుంటుందనే నమ్మకంతో వారు ఇన్వెస్ట్ చేస్తూ రెండేండ్ల నుంచి నష్టాలు భరిస్తున్నారు. ఇప్పుడు నమ్మకం సన్నగిల్లి వారంతా మార్కెట్ నుంచి తప్పుకొంటే పరిస్థితులు దయనీయంగా మారే అవకాశం ఉన్నది.

2014లో డాలర్‌తో పోలిస్తే ఆ ఏడాది అత్యుత్తమ పనితీరు కనబరిచిన ఆసియా-పసిఫిక్ టాప్ టెన్ కరెన్సీలో మన రూపాయి మొదటి స్థానంలో నిలిచింది. 2025-26లో రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే 9.9 శాతం పడిపోయి ఆసియా కరెన్సీలో అత్యంత బలహీనమైనదిగా నిలిచింది. శ్రీలంక, నేపాల్, పాకిస్థాన్ కరెన్సీ కన్నా మన కరెన్సీ బలహీనంగా ఉన్నది. బీజేపీ అభిమానులు మోదీని విశ్వగురు అని ఆకాశానికి ఎత్తేస్తున్నారు. రూపాయి పాతాళంలో పడిపోతుంటే ఆ అభిమానులు మాత్రం విశ్వగురు నినాదాన్ని మాత్రం వదలడం లేదు. పాకిస్థాన్, అఫ్ఘనిస్థాన్ కరెన్సీ కన్నా మన కరెన్సీ బలహీనంగా ఉన్నదని ఎవరైనా అంటే..'అయితే పాకిస్థాన్‌కు పో' అని బీజేపీ అభిమానులు సూచిస్తున్నారు. మన రూపాయి కన్నా అఫ్ఘాన్ రూపాయి విలువ ఎక్కువ. మన రూపాయికి అఫ్ఘాన్ 1 రూపాయి 35 పైసలు సమానం. హైదరాబాద్‌లో ఇప్పుడు కిలో బియ్యం ధర రూ.85 ఉన్నది. సరిగ్గా ఆరు నెలల క్రితం వరకు ఈ ధర రూ.50 వరకు ఉండేది. కేవలం ఆరు నెలల్లో 70 శాతం పెరుగడమంటే.. ఇది గతంలో ఎప్పుడూ కనీవినీ ఎరుగనిది. రైతుల ఆదాయం 2022 నాటికి రెట్టింపు చేస్తామని 2016లో మోదీ బరేలీలో జరిగిన రైతు సభలో హామీ ఇచ్చారు. చెప్పిన గడువు దాటి నాలుగేండ్లు అవుతున్నా రైతుల ఆదాయం రెట్టింపు కాలేదు. కానీ ఆరు నెలల్లోనే బియ్యం ధరలు రెట్టింపు అయ్యాయి. మధ్యతరగతి జీవితాలను సంక్షోభంలోకి నెడుతున్నారు.

ఆహార ధాన్యాలు సంక్షోభాన్ని ఎదుర్కోనున్నాయని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్ ఇటీవల ఆందోళన వ్యక్తం చేశారు. ఇందిరాగాంధీ హయాంలో గరీబీ హటావో అని నినాదం ఇచ్చినట్టు కేంద్రంలోని బీజేపీ పాలన మధ్యతరగతిని చాలా వేగంగా పేదలుగా మారుస్తున్నది. దేశంలో 80 కోట్ల మంది దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారంటూ సబ్సిడీ బియ్యం ఇస్తున్నారు. పరిస్థితి ఇలానే ఉంటే పేదల సంఖ్య మరింత పెరిగే ప్రమాదం ఉన్నది. అసంతృప్తితో యువత ఉద్యమిస్తుంటే..నివారించే మార్గాలపై కేంద్ర పాలకులు దృష్టి పెట్టకుండా అణచివేతపైనే దృష్టి సారిస్తున్నారు. ఇకనైనా ఓటు బ్యాంకు రాజకీయాలను పక్కన పెట్టి ముంచుకొస్తున్న ప్రమాదంపై దృష్టి పెట్టకపోతే దేశం తీవ్రంగా నష్టపోతుంది.

పిల్లల సోషల్ మీడియా భద్రత

సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల వల్ల పిల్లలు ఎదుర్కొంటున్న ప్రమాదాల నుంచి వారిని రక్షించేందుకు సమగ్రమైన, పటిష్ఠమైన నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు స్పందించింది. ఈ విషయంపై ఈరోజు కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్ మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు విచారణ చేపట్టింది. 'ది ఎమరాల్డ్ హైట్స్ ఇంటర్నేషనల్ స్కూల్', దాని డైరెక్టర్ సిద్ధార్థ్ సింగ్ గిర్నార్ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. సోషల్ మీడియా వాడకానికి కనీస వయసు నిబంధనలు, ఆన్‌లైన్ వేధింపుల నుంచి రక్షణ కల్పించే మార్గదర్శకాలు రూపొందించాలని వారు తమ పిటిషన్‌లో కోరారు. కేంద్ర ప్రభుత్వం, మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ, న్యాయ మంత్రిత్వ శాఖ, జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌ను ప్రతివాదులుగా చేర్చారు. ఇప్పటికే ఇలాంటి అంశంపై పెండింగ్‌లో ఉన్న మరో కేసుతో ఈ పిటిషన్‌ను ధర్మాసనం జతచేసింది. తదుపరి విచారణను డిసెంబర్ 3వ



తేదీకి వాయిదా వేసింది. ప్రస్తుతం చాలా సోషల్ మీడియా సంస్థలు 13 ఏళ్ల కనీస వయసును స్వీయ-ధృవీకరణ పద్ధతిలో అమలు చేస్తున్నాయని, ఇది భారతీయ చట్టాల ప్రకారం పిల్లలకు లభించాల్సిన రక్షణకు సరిపోదని పిటిషనర్లు వాదించారు. 2023 నాటి డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్ ప్రకారం 18 ఏళ్లలోపు ప్రతి ఒక్కరినీ 'పిల్లలు'గా పరిగణిస్తారని, వారికి అదనపు రక్షణ కల్పించాలని గుర్తుచేశారు. తల్లిదండ్రుల ధృవీకరణతో కూడిన అనుమతి, వారి ప్రవర్తనను ట్రాక్ చేయకుండా ఉండటం, లక్షిత ప్రకటనలపై పరిమితులు వంటివి ఇందులో ఉన్నాయని పేర్కొన్నారు. అయితే, ప్రస్తుతమున్న చట్టాలు అసంపూర్తిగా ఉన్నాయని, పిల్లల భద్రతకు సంబంధించి వయసు నిర్ధారణ, తల్లిదండ్రుల ప్రమేయం, సోషల్ మీడియా సంస్థల జవాబుదారీతనంపై స్పష్టమైన విధానం లేదని పిటిషన్‌లో ఆరోపించారు. సోషల్ మీడియా వల్ల పిల్లలు సైబర్‌బుల్లీయింగ్, వేధింపులు, హానికర కంటెంట్, అపరిచితుల నుంచి ప్రమాదకర పరిచయాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అధిక వినియోగం వల్ల నిద్రలేమి, ఏకాగ్రత తగ్గడం, ఆందోళన, ఆత్మన్యూనత, చదువుపై శ్రద్ధ తగ్గడం వంటి సమస్యలు పెరుగుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో పిల్లల ఖాతాలకు తప్పనిసరి ప్రైవసీ సెట్టింగ్‌లు, వయసుకు తగిన యాక్సెస్, హానికర కంటెంట్‌పై ఆంక్షలు విధించేలా మార్గదర్శకాలు జారీ చేయాలని పిటిషనర్లు సుప్రీంకోర్టును అభ్యర్థించారు.

కొత్త డీలిమిటేషన్ ప్రతిపాదనలపై అఖిలపక్షం ఏర్పాటు చేయండి

కొత్త డీలిమిటేషన్ ప్రతిపాదనలపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. కొత్త బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టే ముందు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి అన్ని పార్టీల అభిప్రాయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ఏకపక్ష వైఖరిపై ఖర్గే తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. గతంలో చేసిన విధంగా రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటులో బలవంతంగా ఆమోదింపజేసుకునే ప్రయత్నం మరోసారి చేయొద్దని ప్రధానిని కోరారు. ఆగస్టు 13న వర్షాకాల సమావేశాలను నిరవధికంగా వాయిదా వేసి ఇప్పటికే 64 రోజులు గడిచినా, పార్లమెంట్ ఉభయ సభలను ఇంకా వాయిదా వేయలేదని లేఖలో పేర్కొన్నారు. రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం కోసం ప్రభుత్వం పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయనుందని వార్తలు వెలువడిన నేపథ్యంలో ఖర్గే లేఖ రాసినట్లు తెలుస్తోంది. "డీలిమిటేషన్‌పై ఏ రాజ్యాంగ సవరణ బిల్లునైనా తీసుకురావడానికి ముందు అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని నేను మీకు ఏప్రిల్ 11న మొదటిసారిగా లేఖ రాశాను. కానీ, మీరు అలా చేయలేదు. ఆ తర్వాత ఏప్రిల్ 14న అర్ధరాత్రి దాటిన తర్వాత మీరు బిల్లులను బయటపెట్టి ఏప్రిల్ 16న ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఏప్రిల్ 17న లోక్‌సభలో డీలిమిటేషన్‌పై రాజ్యాంగ సవరణ బిల్లుకు అవసరమైన మూడింట రెండు వంతుల మెజారిటీని సాధించడంలో ప్రభుత్వం విఫలమైంది. ఆ తర్వాత జూలై 16, ఆగస్టు 27న



అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ మళ్లీ లేఖ రాశాను. ఇప్పుడు నేను నాల్గోసారి ఇలా రాస్తున్నాను. పార్లమెంటులో డీలిమిటేషన్‌పై కొత్త ప్రతిపాదనలను ఖరారు చేయడానికి ముందు వాటిపై సవివరంగా చర్చించడానికి దయచేసి అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయండి. అన్ని రాజకీయ పార్టీలకు తమలో తాము, ఒకరితో మరొకరు, ఇతర భాగస్వాములందరితో చర్చించుకోవడానికి తగినంత సమయం ఉండాలి. గతంలో మీరు చేసినట్లుగా రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటులో బలవంతంగా ఆమోదింపజేయడానికి మళ్లీ ప్రయత్నించవద్దు."

నెలాఖరులో బిల్లులు పెట్టే అవకాశం

ఇదిలా ఉండగా, ఈ నెలాఖరులో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించే అవకాశం ఉన్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లుల ఆమోదం కోసం ఈ ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని కేంద్రం భావిస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై అనేక వార్తలు వెలువడుతున్నా, అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. అటు నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లులను వర్షాకాల సమావేశాల్లోనే ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావించింది. అయితే, నీట్ పరీక్షా పత్రాల లీకేజీ వివాదం, సీజేపీ ఆందోళనల వల్ల కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి రావడంతో ఈ ప్రతిపాదనను తాత్కాలికంగా వాయిదా వేసింది. ఇప్పుడు ప్రత్యేక సమావేశాల్లో బిల్లులను ఆమోదించుకోవాలని భావిస్తోంది. అయితే, సర్ ప్రక్రియకు వ్యతిరేకంగా ఆందోళనలు కొనసాగుతోన్న వేళ ఈ బిల్లులు చర్చకు వస్తుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. వాస్తవానికి ఒక రాజ్యాంగ సవరణకు పార్లమెంటులో ప్రత్యేక మెజారిటీ అవసరం ఉంటుంది. లోక్‌సభలో ఎన్డీఏ కూటమికి మెజారిటీ ఉన్నప్పటికీ, రాజ్యాంగ సవరణకు అవసరమైన మూడింట రెండు వంతుల సంఖ్యాబలం (సుమారు 360 సీట్లు) వారికి లేదు. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 20మంది ఎంపీలు, శివసేన (యూబీటీ)కి చెందిన ఆరుగురు ఎంపీలు అధికార పక్షంలో చేరడంతో ప్రభుత్వ బలం కాస్త పెరిగింది. ఈ బిల్లులకు మరింత మద్దతు కూడగట్టేందుకు కేంద్ర ప్రభుత్వం డీఎంకే (ణవీళ్ఖ) సహా పలు చిన్న పార్టీలతో చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది.

అయోమయంలో భారత విదేశాంగ అధికారులు

అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో భారత పర్యటనపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. రూబియో ముంబయిలో భారత ప్రభుత్వ అధికారులతో సమావేశం కానున్న విషయంపై విదేశాంగ శాఖ అధికారులకే స్పష్టత లేదని విమర్శించారు. ఆ వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీ వివరణ ఇవ్వాలని అన్నారు. ఒకవేళ మోదీ కోరుకుంటే తానే వివరిస్తానంటూ ఎక్స్‌లో వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. అమెరికా రాయబారి సెర్గియో గోర్ ఇటీవల రూబియో పర్యటనకు సంబంధించిన వివరాలను వెల్లడించిన నేపథ్యంలో రాహుల్ పలు వ్యాఖ్యలు చేశారు. వచ్చే వారం ముంబయిలో భారత ప్రభుత్వ అధికారులతో రూబియో సమావేశమవుతారని, ఆ భేటీలో విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కూడా పాల్గొంటారని భావిస్తున్నట్లు గోర్ తెలిపారు. దీనిపై స్పందించిన రాహుల్, భారత విదేశాంగ శాఖలోనే ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి ఉందంటూ కేంద్రంపై తాజాగా విమర్శలు గుప్పించారు.

'అధికారులంతా అయోమయంలోనే!'

మార్కో రూబియో తన ఉద్యోగిని ముంబయికి పిలిపించుకున్నారంటూ రాహుల్ తన పోస్టులో పేర్కొన్నారు. విదేశాంగ శాఖలోని అధికారులు ఏం జరుగుతుందో తెలియక అయోమయంలో ఉన్నారని ప్రధాని మోదీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఆ విషయం గురించి మోదీ వివరించాల్సి ఉంటుందని, లేదంటే తానే వివరించాల్సి వస్తుందంటూ సోషల్ మీడియాలో పోస్ట్ ద్వారా ఎద్దేవా చేశారు రాహుల్ గాంధీ.

'గోర్ ఎందుకు వెల్లడిస్తున్నారు?'

అయితే రూబియో పర్యటనపై కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే



కేంద్రప్రభుత్వాన్ని ప్రశ్నించింది. భారత విదేశాంగ మంత్రి జైశంకర్‌తో రూబియో భేటీ గురించి అమెరికా రాయబారి వివరాలు వెల్లడించడంపై అభ్యంతరం తెలిపింది. ఇలాంటి విషయాలను భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ప్రకటించాల్సి ఉండగా, అమెరికా రాయబారి ఎందుకు వెల్లడిస్తున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ప్రశ్నించారు. భారత విదేశాంగ మంత్రి దేశంలో నిర్వహించే సమావేశాల వివరాలను ఇతరులు ప్రకటించడం అసాధారణమని ఆయన వ్యాఖ్యానించారు. రూబియో ముంబయిలో భారత ప్రభుత్వ అధికారులను కలుస్తారని చెప్పడం ఒకట్తైతే, ఆ సమావేశానికి జైశంకర్ కూడా వస్తారని అమెరికా రాయబారి ప్రకటించడం మరో విషయమని పేర్కొన్నారు.

అక్టోబర్ 17 నుంచి 22 వరకు పర్యటన

బ్లూమ్‌బర్గ్ న్యూ ఎకానమీ ఫోరంలో జరిగిన చర్చ సందర్భంగా గోర్ ఆ వివరాలను వెల్లడించారు. రూబియో ముంబయిలో భారత ప్రభుత్వ అధికారులతో సమావేశమవుతారని, దిల్లీ నుంచి మరికొందరు అధికారులు కూడా అక్కడికి వస్తారని చెప్పారు. జైశంకర్ కూడా ఈ సమావేశంలో పాల్గొంటారని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఆ ప్రకటనే ఇప్పుడు కాంగ్రెస్ విమర్శలకు కారణమైంది. అమెరికా విదేశాంగ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, రూబియో అక్టోబర్ 17-22 వరకు ఉజ్బెకిస్థాన్, భారత్‌లో పర్యటించనున్నారు. తొలుత ఉజ్బెకిస్థాన్‌లోని సమర్‌కండ్‌కు వెళ్లి, అక్కడ సెంట్రల్ ఆసియా దేశాలతో జరిగే సీ5ం1 మంత్రుల సమావేశంలో పాల్గొంటారు. అనంతరం భారత్‌కు వచ్చి ముంబయి, గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో పర్యటిస్తారు. భారత్‌లో పర్యటన సందర్భంగా సీనియర్ ప్రభుత్వ అధికారులతో సమావేశమై ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం, ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై చర్చించనున్నారు. ఇంధన రంగంలో పరస్పర సహకారాన్ని పెంచుకునే అవకాశాలపైనా చర్చలు జరపనున్నారు. వ్యాపార రంగానికి చెందిన ప్రముఖులతోనూ రూబియో సమావేశమై వాణిజ్యం, పెట్టుబడులకు సంబంధించిన అంశాలపై మాట్లాడనున్నారు.

వాణిజ్యం, ఇంధన రంగాలపై దృష్టి

రూబియో పర్యటన రాజకీయ చర్చలకే పరిమితం కాకుండా వ్యాపార సంబంధాలపైనా ప్రధానంగా దృష్టి పెట్టనుంది. భారత్- అమెరికా మధ్య వాణిజ్యం, ఇంధన సహకారం, సాంకేతిక రంగంలో భాగస్వామ్యం, పెట్టుబడుల అవకాశాలు ఆ పర్యటనలో కీలకంగా ఉండనున్నాయి. అమెరికా కంపెనీలు భారత్‌లో పెట్టుబడులు పెట్టడం, ఇరు దేశాల మధ్య వ్యాపార సంబంధాలను మరింత విస్తరించడం వంటి అంశాలపై చర్చలు జరిగే అవకాశం ఉంది. ఈ ఏడాది మే 23 నుంచి 26 వరకు రూబియో భారత్‌లో పర్యటించారు. ఇప్పుడు ఆయన చేపట్టనున్న పర్యటన ఈ ఏడాదిలో రెండో అధికారిక పర్యటన కానుంది.

రోజుకు రూ. 200 కోట్ల నష్టం..
కన్నాట్ ప్లేస్ బంద్‌పై వ్యాపారుల ఆవేదన

'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) ప్రతిపాదించిన 'లెహ్రా దో తిరంగా' నిరసన కార్యక్రమం కారణంగా ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో సెంట్రల్ పార్క్‌ను మూసివేయడాన్ని వ్యతిరేకిస్తూ వ్యాపారులు దాఖలు చేసిన పిటిషన్‌పై తక్షణ విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. అయితే, ఈ మూసివేత వల్ల చిన్న వ్యాపారులపై పడే ప్రభావం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తూ కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ పరిణామంతో తమకు రోజుకు సుమారు రూ. 200 కోట్ల నష్టం వాటిల్లుతోందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఢిల్లీ కిరాణా కమిటీ, ఢిల్లీ ఐరన్ అండ్ హార్డ్‌వేర్ మర్చంట్ అసోసియేషన్ ఈ మేరకు పిటిషన్ దాఖలు చేశాయి. పిటిషనర్ల తరఫున న్యాయవాది జై అనంత్ దేహ్రాయ్.. భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం ముందు నేడు వాదనలు వినిపించారు. న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ (ఎన్‌డీఎంసీ) అర్ధరాత్రి వేళ పార్క్‌ను మూసివేయాలని ఆదేశాలు జారీ చేసిందని, పండగ సీజన్‌లో ఈ నిర్ణయం వల్ల వ్యాపార కార్యకలాపాలు స్తంభించిపోయి, తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆయన కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన సీజేఐ సూర్యకాంత్.. "ఈ విషయంలో సంబంధిత వర్గాలన్నింటిలోనూ మంచి ఆలోచన వస్తుందని మేము ఆశిస్తున్నాము. పండగ రోజుల్లో చిన్న దుకాణదారులు తమ జీవనోపాధిని ఎలా సంపాదించుకుంటారో మాకు తెలుసు. వారి కుటుంబాలు ఎదుర్కొనే కష్టాలు, ఇబ్బందులు మాకు అర్థమవుతాయి" అని



వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో జస్టిస్ బాగ్చీ జోక్యం చేసుకుంటూ.. నిరసన తెలిపే హక్కు, శాంతిభద్రతల పరిరక్షణ, వ్యాపారం చేసుకునే హక్కు పరస్పరం ముడిపడి ఉంటాయని అన్నారు. ఒకవేళ ప్రభుత్వం విధించిన ఆంక్షలు అహేతుకమైనవని, వాటి వల్ల వ్యాపారులకు చట్టవిరుద్ధంగా నష్టం వాటిల్లిందని తర్వాత తేలితే, రాజ్యాంగం కల్పించిన ప్రత్యేక అధికారాలను ఉపయోగించి కోర్టు నష్టపరిహారం ఇప్పించవచ్చని ఆయన స్పష్టం చేశారు. ఈ అంశంపై ఇప్పటికే ఢిల్లీ హైకోర్టులో సంబంధిత పిటిషన్లు విచారణలో ఉన్నాయి. దసరా సెలవుల అనంతరం, అక్టోబర్ 26 లేదా 27 తేదీల్లో ఈ పిటిషన్‌పై విచారణ జరిపే అవకాశం ఉంది.

ఇది ప్రభుత్వాన్ని మార్చే కుట్ర



కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేను, ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు నేహా బోరాను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. ఎలక్టోరల్ రోల్స్‌లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో తలపెట్టిన 'లెహ్రా దో తిరంగా' నిరసన ర్యాలీకి కొద్దిసేపటి ముందు ఈ పరిణామం చోటుచేసుకుంది. ఈ సాయంత్రం 5 గంటలకు సెంట్రల్ పార్క్‌లో నిరసన చేపట్టాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. అయితే, ఈ ర్యాలీకి మున్సిపల్ కౌన్సిల్ నుంచి అనుమతి లేదని, ఆ ప్రాంతంలో భారతీయ నాగరిక్ సురక్షా సంహిత సెక్షన్ 163 అమల్లో ఉందని పోలీసులు తెలిపారు. ఈ క్రమంలోనే ర్యాలీకి ముందు అభిజీత్ దీప్కేను, నేహా బోరాను కస్టడీలోకి తీసుకున్నారు. ఈ అరెస్టులు రాజకీయంగా తీవ్ర దుమారం రేపాయి. ప్రతిపక్షాలు విదేశీ శక్తులతో కలిసి 'ప్రభుత్వాన్ని మార్చే కుట్ర' (రెజీమ్ ఛేంజ్) పన్నుతున్నాయని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తీవ్ర ఆరోపణలు చేశారు. 'రెజీమ్ ఛేంజ్' వంటి పదాల వాడకంతో ప్రతిపక్షాల అసలు ఎజెండా దేశం ముందు బయటపడిందని.. విదేశీ శక్తులతో కలిసి దేశాన్ని అస్థిరపరిచేందుకు అర్బన్ నక్సల్స్ పన్నిన పన్నాగం ఇది అని ఆయన మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో అధికారం ప్రజల తీర్పుతో వస్తుంది కానీ, అరాచకంతో కాదు అని ఆయన హితవు పలికారు. నేతల అరెస్టులు జరిగినప్పటికీ, సుమారు 200 నుంచి 300 మంది నిరసనకారులు కన్నాట్ ప్లేస్‌కు చేరుకుని తమ నిరసనను కొనసాగించారు.

బంగ్లాదేశ్ తరహాలో పాలన మార్పునకు కాంగ్రెస్ కుట్ర..



బంగ్లాదేశ్‌లో జరిగిన తరహాలో భారత్‌లోనూ పాలన మార్పునకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుతున్నామనే పేరుతో దేశంలో అరాచకాన్ని సృష్టించేందుకు కాంగ్రెస్ నేతలు ప్రయత్నిస్తున్నారని, రాజ్యాంగ సంస్థలను దెబ్బతీయడమే వారి లక్ష్యమని విమర్శించారు. శుక్రవారం ఉత్తర్‌ప్రదేశ్‌లోని లఖ్‌నవూలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన కాంగ్రెస్, రాహుల్ గాంధీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశంలో ఇటీవలి పరిణామాలు అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నాయని రాజ్‌నాథ్ అన్నారు. యువత శక్తిని దేశ అభివృద్ధికి వినియోగించకుండా, రాజకీయ అస్థిరత సృష్టించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. బంగ్లాదేశ్ తరహాలో పాలన మార్పు తీసుకురావాలని కాంగ్రెస్ నేతలు బహిరంగంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. వారి వ్యాఖ్యలను బట్టి ప్రజాస్వామ్య సంస్థలను బలహీనపరచడమే ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోందన్నారు.

అధికారం కోసమే అరాచకమా?

ఎన్నికల సంఘం, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్), ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్నామని కాంగ్రెస్ చెబుతున్నా.. అసలు లక్ష్యం అధికారం చేజిక్కించుకోవడమేనని రాజ్‌నాథ్ ఆరోపించారు. 'పాలన మార్పు' వంటి పదాలను ఉపయోగించడం వెనుక ఉద్దేశం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. రాజకీయ స్వార్థం కోసం దేశ ప్రయోజనాలను పక్కనపెడితే ప్రజాస్వామ్య చర్చలు వాస్తవాల ఆధారంగా కాకుండా మొండివైఖరి, దుష్ప్రచారానికి వేదికగా మారతాయని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యం పేరుతో అరాచకాన్ని సృష్టించడానికి, రాజ్యాంగ సంస్థలపై దాడులకు, దేశాభివృద్ధికి ఆటంకం కలిగించడానికి ఎవరికీ హక్కు లేదని రాహుల్ గాంధీని ఉద్దేశించి అన్నారు. చట్టాలను గౌరవిస్తూ శాంతిభద్రతలను కాపాడుకోవాలని, రాజకీయ ప్రయోజనాల కోసం రాజ్యాంగ వ్యవస్థలను దెబ్బతీయకూడదని సూచించారు. ప్రజల తీర్పును గౌరవించి, ప్రజాస్వామ్యాన్ని కాపాడుతున్నామనే పేరుతో రాజకీయ గందరగోళం సృష్టించడం మానుకోవాలని రాహుల్‌కు హితవు పలికారు.

ఇందిరాగాంధీ ఎమర్జెన్సీని గుర్తుచేస్తూ..

కాంగ్రెస్ గతంలోనూ ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలను దెబ్బతీసిందని రాజ్‌నాథ్ విమర్శించారు. 1975లో ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీ, 1984లో సిక్కులపై జరిగిన హింస, 1990లో కరసేవకుల హత్యలకు సంబంధించిన పరిణామాలను ప్రస్తావించారు. నాటి నుంచి నేటి వరకు కాంగ్రెస్ వైఖరిలో మార్పు లేదని ఆరోపించారు. "1975లో ఇందిరాగాంధీ ప్రజాస్వామ్యాన్ని జైల్లో పెట్టారు. ఇప్పుడు రాహుల్ గాంధీ జేబులో రాజ్యాంగాన్ని పెట్టుకుని అరాచకం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారు" అని రాజ్‌నాథ్ వ్యాఖ్యానించారు. ఎన్నికల సంఘాన్ని కాంగ్రెస్ రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుందని కూడా ఆయన ఆరోపించారు. 1993లో ఎన్నికల కమిషనర్ల నియామకం, అప్పటి ప్రధాన ఎన్నికల కమిషనర్ టీఎన్ శేషన్.. ఎన్నికల కమిషనర్ నవీన్ చావ్లాపై చేసిన ఆరోపణలను ప్రస్తావించారు. చావ్లా కాంగ్రెస్ నేతలకు ఎన్నికల సంఘానికి సంబంధించిన రహస్య సమాచారాన్ని చేరవేశారని శేషన్ ఆరోపించినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ ఆయనను తొలగించకుండా కాపాడటమే కాకుండా, తర్వాత ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా నియమించిందని రాజ్‌నాథ్ విమర్శించారు.

అవును, ప్రభుత్వాన్ని మార్చడమే మా లక్ష్యం
ప్రశాంత్ భూషణ్ సంచలన వ్యాఖ్యలు

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ)కి వ్యతిరేకంగా సాగుతున్న నిరసనల వెనుక అసలు ఉద్దేశం ప్రభుత్వాన్ని మార్చడమేనన్న బీజేపీ ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో, సీనియర్ న్యాయవాది, నిరసనకారుల బృంద సభ్యుడు ప్రశాంత్ భూషణ్ మాట్లాడుతూ, "అవును, మేము ప్రభుత్వాన్ని మార్చాలనే కోరుకుంటున్నాం" అని చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా దుమారం రేపాయి. ఈ వ్యాఖ్యలతో నిరసనకారుల అంతర్గత ఎజెండా స్పష్టమైందని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తీవ్రంగా స్పందించారు. గురువారం సాయంత్రం ఢిల్లీలో ఏఐఎస్ఏ నాయకురాలు నేహా బోరా, సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కేలతో కలిసి ప్రశాంత్ భూషణ్ మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. "ప్రభుత్వంపై అసంతృప్తిని వ్యక్తం చేయడం ప్రజాస్వామ్యంలో నేరం కాదు. ఈ పోరాటం ఇప్పుడు నిజంగా ప్రభుత్వాన్ని మార్చడం కోసమే. ప్రభుత్వం ఇలాగే నిరంకుశంగా వ్యవహరిస్తే, కచ్చితంగా వ్యవస్థలో మార్పు వస్తుంది. గతంలో బీజేపీ కూడా అధికార మార్పిడి కోసం ఎన్నో ఉద్యమాలు చేపట్టింది. ఇప్పుడు మేము చేస్తుంటే కుట్ర అని ఆరోపిస్తారా? ఈ నియంతృత్వ వైఖరికి వ్యతిరేకంగా, ప్రజాస్వామ్యాన్ని అణచివేస్తున్న సర్కారుపై మా పోరాటం కొనసాగుతుంది" అని ఆయన స్పష్టం చేశారు. ప్రశాంత్ భూషణ్ వ్యాఖ్యలపై రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ శుక్రవారం లక్నోలో ఘాటుగా స్పందించారు. "అరాచక రాజకీయాల్లో యువతను పావులుగా మార్చాలని నిరసనకారులు కుట్ర పన్నుతున్నారు. బంగ్లాదేశ్ తరహాలో ఇక్కడ కూడా ప్రభుత్వాన్ని కూల్చడమే వారి లక్ష్యం. వారిలో ఒకరు ఈ విషయాన్ని బహిరంగంగానే వెల్లడించారు, దీన్నిబట్టి వారి అసలు ఎజెండా తేటతెల్లమవుతోంది" అని ఆయన వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ, ఆయన అనుచరులు దేశంలో అశాంతిని రేకెత్తించడం, రాజ్యాంగ సంస్థల విశ్వసనీయతను దెబ్బతీయడం మానుకోవాలని రాజ్ నాథ్ హితవు పలికారు. మరోవైపు, నిరసనకారుల బృందంలోని నేహా బోరా, బంగ్లాదేశ్‌లో జరిగిన యువజన ఉద్యమం తమకు స్ఫూర్తి అని పేర్కొన్న వీడియోను బీజేపీ ప్రధానాస్త్రంగా మలుచుకుంది.

మహానగర్

కోతల ప్రకంపనలు!

విద్యుత్ శాఖలో తాజా పరిణామాల కలకలం.. విద్యుత్ సరఫరాలో అంతరాయాలపై సీఎం సీరియస్

వెనువెంటనే 'యాదాద్రి'పర్యవేక్షణకు ఐదుగురు ఐఏఎస్‌లతో కమిటీ.. ప్లాంట్ పనితీరును క్షుణ్ణంగా పరిశీలించి నివేదిక ఇవ్వనున్న కమిటీ

ఇంధన శాఖ ప్రత్యేక సీఎస్ మిత్తల్, జెన్‌కో ఎండీ హరీశ్‌ను పక్కన పెట్టడంపై సందేహాలు

నివేదిక ఆధారంగా ఇద్దరు ఉన్నతాధికారులపై వేటు పడుతుందనే చర్చ.. మరోవైపు హుటాహుటిన యాదాద్రికి వెళ్లిన మిత్తల్, హరీశ్

జెన్‌కో డైరెక్టర్లూ అక్కడే మకాం..సీఎం వ్యాఖ్యలపై అంతర్గత సమావేశంలో చర్చ!

విధుల్లో నిర్లక్ష్యం ఆరోపణలతో యాదాద్రి సీఈ సస్పెన్షన్.. ఉన్నతాధికారులతో మాట్లాడి ఆరా తీసిన డిప్యూటీ సీఎం భట్టి!



హైదరాబాద్: ఇంధన శాఖలో విద్యుత్ కోతల ప్రకంపనలు మొదలయ్యాయి. కోతలు కొనసాగితే ఐఏఎస్‌లపై సైతం చర్యలకు వెనుకాడనని బుధవారం ముఖ్యమంత్రి హెచ్చరించారు. వెనువెంటనే గురువారం యాదాద్రి థర్మల్ ప్లాంట్ పర్యవేక్షణ, పరిశీలనకు ప్రభుత్వం ఐదుగురు ఐఏఎస్‌లతో కమిటీ వేసింది. దీంతో ఉన్నతాధికారులు ఉరుకులు, పరుగులు పెడుతున్నారు. ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిత్తల్, జెన్‌కో ఎండీ హరీశ్ హుటాహుటిన యాదాద్రి ప్లాంట్‌కు వెళ్ళారు. ఇక జెన్‌కో డైరెక్టర్లంతా అక్కడే మకాం వేశారు. మరోవైపు యాదాద్రి థర్మల్ కేంద్రం చీఫ్ ఇంజనీర్ సురేష్ నాయక్‌ను జెన్‌కో ఎండీ సస్పెండ్ చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు. మరోవైపు యాదాద్రి కేంద్రంగా ఇంధనశాఖ, జెన్‌కో ఉన్నతాధికారులు రహస్యంగా సమావేశమైనట్టు తెలిసింది. ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై అధికారులు సీరియస్‌గా చర్చించినట్టు తెలిసింది. సీఎం వ్యాఖ్యలపై కొందరు ఒకింత అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. కాగా ఈ భేటీ జరిగిందనే సమాచారంతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దీనిపై ఆరా తీసినట్టు తెలిసింది. మొత్తం మీద తాజా పరిణామాలు విద్యుత్ శాఖలో తీవ్ర కలకలం రేపుతుండగా, కొందరు కీలక అధికారులపై చర్యలు తప్పవనే చర్చా ఇంధన శాఖలో జరుగుతోంది.

యాదాద్రి చుట్టూ వివాదం

యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం సాక్షిగా వివాదం మొదలైంది. బొగ్గు కొరత తీవ్రంగా ఉందని అధికారులు చెబుతున్నారు. 4 వేల మెగావాట్ల ప్లాంట్ల నుంచి కేవలం సగటున 400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కూడా జరగడం లేదు. మిగతా ప్లాంట్లూ బొగ్గు కొరతను ఎదుర్కొంటున్నాయి. జల విద్యుత్ ప్రాజెక్టులు పడకేశాయి. కొందామన్నా బహిరంగ మార్కెట్‌లో కరెంటు అంత సులభంగా అందుబాటులో లేదు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా అనధికారిక కోతలు అమలవుతున్నాయి. కరెంటు కోతలపై విపక్షాలు విమర్శలు గుప్పిస్తుండగా, ప్రజలు సైతం నిరసనలు వ్యక్తం చేస్తున్నారు.

దీంతో సీఎం ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, జెన్‌కో ఎండీపై సీరియస్ అయ్యారు. 4 వేల మెగావాట్ల ప్లాంట్ సరిగా పని చేయకపోవడాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. ఈ నేపథ్యంలో ఐదుగురు ఐఏఎస్ అధికారులతో కమిటీ వేసింది. చెవ్వూరు హరికిరణ్ (ఎక్సైజ్ కమిషనర్), వెంకటేశ్ ధోత్రే, (విద్యాశాఖ ప్రత్యేక కార్యదర్శి), రాహుల్ రాజ్ (సహకార శాఖ ప్రత్యేక కమిషనర్, రిజిరస్టార్), జెండాగే హనుమంత్ కొండిబా (ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈవో), కిల్లు శివకుమార్ నాయుడు (ఆర్‌అండ్‌ఆర్, భూసేకరణ కమిషనర్)ను కమిటీలో చేర్చింది.

యాదాద్రిపై దృష్టి.. విస్తృత తనిఖీలు

కొన్నాళ్ళుగా ఇంధనశాఖ, జెన్‌కో ఉన్నతాధికారులు ఇచ్చే నివేదికల్లో విశ్వసనీయత లేదని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో ఈ ఐదుగురు అధికారులూ బొగ్గు సరఫరా నుంచి విద్యుదుత్పత్తి వరకు తనిఖీలు నిర్వహించడంతో పాటు యాదాద్రిలో జరిగే పరిణామాలను పరిశీలిస్తారు. గురువారం నుంచి ఈ నెలాఖరు వరకూ ఈ బృందం యాదాద్రి థర్మల్ ప్లాంట్‌ను పరిశీలించి నివేదిక ఇస్తుంది. దీని ఆధారంగా ఉన్నతాధికారులపై వేటు వేస్తారనే ప్రచారం జరుగుతోంది. కాగా కమిటీ ప్లాంట్‌లోని నాలుగు యూనిట్లూ పూర్తిస్తాయిలో పని చేస్తున్నాయా? లేదా?.. ఉత్పత్తి తగ్గడానికి కారణాలేమిటి? నాలుగు బొగ్గు సరఫరా వ్యవస్థలు (కోల్ స్ట్రీమ్స్) కూడా పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాయా? ఏవైనా అంతరాయాలు ఉంటే వాటికి కారణాలేమిటి? బొగ్గు సరఫరా వ్యవస్థల గరిష్ట సామర్థ్యం ఎంత? ప్రస్తుతం ఎంత మేర సరఫరా జరుగుతోంది? అనే అంశాలను పరిశీలిస్తుంది. ప్లాంట్‌కు అందుతున్న బొగ్గు గ్రేడ్ ఏమిటి? ఆ నాణ్యతకు అనుగుణంగా విద్యుదుత్పత్తి జరుగుతోందా? బొగ్గు నాణ్యతలో తేడాల వల్ల ఉత్పత్తిపై ప్రభావం పడుతోందా? అనే విషయాలను సమీక్షించనుంది. నాలుగు యూనిట్లకు అవసరమైన స్థాయిలో బొగ్గు సరఫరా అవుతోందా? బొగ్గును బంకర్లలోకి పంపే ప్రక్రియలో కీలకమైన వీఈజీఎఫ్ (వేరియబుల్ గేట్ ఫీడర్లు)లో జామింగ్ సమస్యలు ఏమైనా ఉన్నాయా? వీటివల్ల బొగ్గు సరఫరాకు ఆటంకం కలుగుతోందా? ప్లాంట్‌లో బీహెచ్ఈఎల్ చేపట్టాల్సిన పనులు ఇంకా ఏమైనా పెండింగ్‌లో ఉన్నాయా? వాటి ప్రస్తుత స్థితిగతులు తదితర అంశాలను కమిటీ తనిఖీ చేసి నివేదిక ఇవ్వనుంది. బొగ్గు రేక్‌లను అన్ లోడింగ్ చేయడానికి పడుతున్న సమయం ఎంత? ఈ ప్రక్రియను వేగవంతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలేమిటి? అనే అంశాలను కూడా అధికారులు పరిశీలించనున్నారు.

ఆ ఇద్దరు ఉన్నతాధికారులపై వేటు లక్ష్యంగా..?

ఐదుగురు సభ్యుల కమిటీ పూర్తి వివరాలతో నివేదిక రూపొందించనుంది. అయితే వీటన్నింటిపైనా కొన్నేళ్ళుగా పట్టున్న ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మిత్తల్, జెన్‌కో ఎండీ హరీశ్‌ను కాదని మరో కమిటీ వేయడంపై అనేక సందేహాలు నెలకొంటున్నాయి. ఈ ఇద్దరి అధికారుల వైఫల్యాన్ని లక్ష్యంగా చేసుకుని, వేటు వేయడానికే కమిటీ వేసినట్టు జెన్‌కో వర్గాల్లో చర్చ జరుగుతోంది.

డిప్యూటీ సీఎం ప్రశంసించిన మర్నాడే..!

తాజా పరిణామాల నేపథ్యంలో ఇంధన శాఖ ప్రత్యేక కార్యదర్శి, జెన్‌కో ఎండీ యాదాద్రి థర్మల్ ప్లాంట్‌కు వెళ్ళారు. జెన్‌కో డైరెక్టర్లంతా వారిని అనుసరించారు. నైనీ బ్లాక్ నుంచి బొగ్గు రప్పించడం, సింగరేణి బొగ్గు పెంచడం, ఉత్పత్తి మెరుగు పర్చడానికే సమావేశం నిర్వహించినట్టు అధికారులు చెబుతున్నారు. అయితే సీఎం చేసిన వ్యాఖ్యలపై అధికారులు చర్చించినట్టు తెలిసింది. వాస్తవానికి ఒకరోజు ముందే డిప్యూటీ సీఎం విక్రమార్క విలేకరుల సమావేశంలో అధికారుల కృషిని ప్రశంసించారు. ఆ మర్నాడే సీఎం సీరియస్‌గా వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇంతలోనే ఈ మార్పు ఏమిటి? అనే దానిపై అధికారులు చర్చించినట్టు తెలిసింది. కమిటీ వేయడం వెనుక ఉన్నతాధికారులను తప్పించే లక్ష్యం ఉందనే అభిప్రాయం వ్యక్తమైనట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వేసిన కమిటీకి సహకరించకూడదనే చర్చా అధికారులు, సిబ్బందిలో జరిగినట్టు సమాచారం. అయితే తన శాఖలో సీఎం జోక్యం, అధికారుల సమావేశంపై డిప్యూటీ సీఎం భట్టి ఆరా తీసినట్లు తెలిసింది. గురువారం ఆయన ఉన్నతాధికారులతో మాట్లాడినట్టు విద్యుత్ శాఖ వర్గాలు చెబుతున్నాయి.

తెలంగాణ సీఎంవోపై పర్సంటేజీ ఆరోపణలు

తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న మౌలిక వసతుల ప్రాజెక్టుల టెండర్ల కేటాయింపులు, బిల్లుల చెల్లింపులపై అవకతవకలు, అవినీతి ఆరోపణలు గుప్పిస్తూ ఆర్‌వీఎం కన్‌స్ట్రక్షన్స్ ఇండియా లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ నామా రమేశ్.. బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నాయకత్వానికి లేఖ రాసి దాన్ని మీడియాకు లీక్ చేశారు. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ పరిధిలోని రేడియల్ రోడ్-2 ప్రాజెక్టు మూడు ప్యాకేజీల టెండర్లలో అక్రమాలు జరిగాయని ఆయన లేఖలో వివరించారు. సాధారణంగా 10 నుంచి 12 పెద్ద కంపెనీలు పాల్గొనే ఇలాంటి ప్రతిష్టాత్మక టెండర్లలో.. కేవలం నాలుగు సంస్థలు మాత్రమే పాల్గొనేలా సీఎం కార్యాలయం నుంచి ఇతర కాంట్రాక్టర్లకు బెదిరింపు ఫోన్ కాల్స్ వెళ్లాయని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుగానే నిర్ణయించిన సంస్థలకే పనులు కట్టబెట్టేలా ముందస్తు ఒప్పందాలు కుదిరాయని అందులో పేర్కొన్నారు.ఈ టెండర్ల ప్రక్రియలో సుశీ ఇన్‌ఫ్రా సంస్థను ఉద్దేశపూర్వకంగానే డిస్క్వాలిఫై చేశారని నామా రమేశ్ లేఖలో ప్రముఖంగా లేవనెత్తారు. ఇండో-చైనా సరిహద్దు వంటి అత్యంత క్లిష్టమైన ప్రాంతాల్లో 250 కిలోమీటర్లకు పైగా రోడ్లను విజయవంతంగా నిర్మించిన అపార అనుభవం సుశీ ఇన్‌ఫ్రాకు ఉందని తెలిపారు. టెక్నికల్ ఎవాల్యుయేషన్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇచ్చిన అనుభవ పత్రంపై ఎస్ఈ కౌంటర్‌సైన్ లేదనే కుంటిసాకుతో దానిని తిరస్కరించారని, ఆ తర్వాత ప్రత్యామ్నాయ పత్రాలు సమర్పించినా అధికారులు నిరాకరించారని పేర్కొన్నారు. ఎల్-1 బిడ్డర్లు నిర్దేశిత విలువ కంటే 3 నుంచి 15 శాతం అధిక ధరలను కోట్ చేయగా.. సుశీ ఇన్‌ఫ్రా కోట్ చేసిన ధరలు దాదాపు రూ.600 కోట్లు తక్కువగా ఉన్నప్పటికీ, ఆ సంస్థను పక్కనపెట్టి ప్రభుత్వ ఖజానాకు నష్టం చేకూర్చారని లేఖలో ఆరోపించారు. ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మధ్య ఉన్న రాజకీయ విభేదాల కారణంగానే.. రాజగోపాల్ రెడ్డి కుటుంబానికి చెందిన సుశీ ఇన్‌ఫ్రాను లక్ష్యంగా చేసుకుని ఈ అన్యాయానికి పాల్పడ్డారని పేర్కొంటూ సంస్థ ఇప్పటికే కోర్టును ఆశ్రయించిందని వెల్లడించారు.ఈ టెండర్ల గోల్‌మాల్‌తో పాటు, రాష్ట్రంలో ప్రాజెక్టుల కేటాయింపులకు గాను కాంట్రాక్టర్ల నుంచి ఏకంగా 15 శాతం కమీషన్లు డిమాండ్ చేస్తున్నారనే సంచలన ఆరోపణను కూడా లేఖలో ప్రస్తావించారు. ఇది బహిరంగ రహస్యమైనప్పటికీ మంత్రులు, ఎమ్మెల్యేలు ఎవరూ నోరు మెదపడం లేదని, కమీషన్లు చెల్లించిన కాంట్రాక్టర్లకే బిల్లుల విడుదలలో ప్రాధాన్యత ఇస్తున్నారని వివరించారు. గత మూడేళ్లుగా ధ్రువీకరించిన బిల్లులకు సంబంధించి దాదాపు రూ.20,000 కోట్ల చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని విడుదల చేయించుకోవడానికి కూడా భారీ ఎత్తున కమీషన్లు డిమాండ్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లులు రాక ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయి ఇప్పటికే పలువురు కాంట్రాక్టర్లు ప్రాణాలు కోల్పోయారని, నిరాశానిస్పృహల్లో ఉన్నారని పేర్కొన్నారు. పాత పనులకు బిల్లులు చెల్లించలేని ప్రభుత్వం.. కొత్త టెండర్లను ఎలా పిలుస్తుందో అర్థం కావడం లేదని నిలదీశారు.ఈ తీవ్రమైన పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా తక్షణమే జోక్యం చేసుకోవాలని నామా రమేశ్ విజ్ఞప్తి చేశారు. ఏ శాఖకు గానీ, రాజకీయ పార్టీకి గానీ ఎలాంటి కమీషన్లు ఇవ్వాల్సిన అవసరం లేకుండా.. బిల్లులన్నీ ఎప్పటికప్పుడు సకాలంలో చెల్లించేలా పారదర్శక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. అధికారం ఉన్నవారితో కుమ్మక్కై పనులు దక్కించుకునే ప్రీ-అరేంజ్డ్ టెండర్ల సంస్కృతికి చరమగీతం పాడుతూ సుశీ ఇన్‌ఫ్రాకు మద్దతుగా నిలవాలని, అర్హులైన కాంట్రాక్టర్లందరికీ సమాన అవకాశాలు కల్పించేలా ఓపెన్ టెండరింగ్ విధానాన్ని పునరుద్ధరించాలని పిలుపునిచ్చారు. నిర్మాణ రంగాన్ని అవినీతి, అవకతవకల నుంచి కాపాడేందుకు కాంట్రాక్టర్లంతా ఐక్యంగా పోరాడాలని స్పష్టం చేశారు.లేఖను బయట పెట్టడం మాత్రమే కాదు.. మీడియాతోనూ ఇవే ఆరోపణలు చేశారు. ఈ నామా రమేష్‌కు.. ఇంటి పేరు కారణంగా చాలా మంది మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావుకు సంబంధించిన వారని అనుకుంటున్నారు కానీ.. ఈ నామా రమేష్ కు మాజీ ఎంపీకి ఎలాంటి సంబంధం లేదు.

జడ్డంగి సంత మార్కెట్ వద్ద కారు స్కూటీ ఢీ

ఒకరికి రక్తగాయాలు.. ధ్వంసమైన వాహనాలు

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికుల విజ్ఞప్తి

రాజమ్మంగి : జడ్డంగి సంత మార్కెట్ సమీపంలో కారు, మోటారు స్కూటీ ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తికి రక్తగాయాలయ్యాయి. ఈ ఘటనలో స్కూటీ తీవ్రంగా ధ్వంసమవగా, కారు ముందు భాగం కూడా దెబ్బతింది. ప్రమాద స్థలంలో వాహనాల విడిభాగాలు చెల్లాచెదురుగా పడిపోయాయి.జడ్డంగి ప్రాంతంలో రోడ్డు నిర్మాణం జరిగిన తర్వాత ప్రమాదాలు పెరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంత మార్కెట్ పరిసరాల్లో వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉండటంతో ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు ప్రమాదాలకు గల కారణాలను పరిశీలించి, వాహనదారులు, పాదచారుల భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

హుస్నాబాద్‌లో నూతన కబడ్డీ అకాడమీ ఏర్పాటుకు ప్రభుత్వ జీవో జారీ

హుస్నాబాద్ హుస్నాబాద్ నియోజకవర్గంలో క్రీడాభివృద్ధికి మరో ముందడుగు పడింది. రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి, హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ కృషితో హుస్నాబాద్ నియోజకవర్గంలో నూతన కబడ్డీ అకాడమీ ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం అనుమతి మంజూరు చేస్తూ జీవో జారీ చేసింది.యువతలో క్రీడా ప్రతిభను వెలికితీసి, గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులకు మెరుగైన శిక్షణ అందించాలనే లక్ష్యంతో ఈ అకాడమీ ఏర్పాటు కానుంది.కబడ్డీ అకాడమీ జీవోలోని ముఖ్యాంశాలు:హుస్నాబాద్ నియోజకవర్గం, సిద్దిపేట జిల్లాలో నూతన కబడ్డీ అకాడమీ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి.అకాడమీలో మొత్తం 40 మంది క్రీడాకారులకు అవకాశం కల్పించనున్నారు.ఇందులో 20 మంది బాలురు, 20 మంది బాలికలు ఉంటారు.బాలురు, బాలికలకు వేర్వేరుగా కబడ్డీ కోచ్‌లను నియమించనున్నారు.బాలురు, బాలికల కోసం వేర్వేరుగా వార్డెన్లతో పాటు గ్రౌండ్స్‌మెన్, స్వీపర్, సెక్యూరిటీ గార్డు సేవలను కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు.మొత్తం 8 సేవల నియామకానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.ఈ నియామకాలు ఔట్‌సోర్సింగ్ విధానంలో చేపట్టనున్నారు.క్రీడాకారులకు ప్రయోజనం:ఈ అకాడమీ ద్వారా హుస్నాబాద్ నియోజకవర్గంతో పాటు పరిసర ప్రాంతాల యువ క్రీడాకారులకు కబడ్డీలో శిక్షణ పొందేందుకు అవకాశాలు మెరుగుపడనున్నాయి. బాలురు, బాలికలకు సమానంగా అవకాశం కల్పించడం ద్వారా క్రీడల్లో మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేందుకు దోహదపడనుంది.హుస్నాబాద్ ప్రాంతంలో క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఈ అకాడమీ ఏర్పాటు కీలక అడుగుగా నిలవనుంది.ఇప్పటికీ హుస్నాబాద్ నియోజకవర్గంలోనీ గ్రామాలు జాతీయ అంతర్జాతీయ స్థాయిలో కబడ్డీ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ గుర్తింపు సాధించారు. కబడ్డీ అకాడమీ ఏర్పాటుకు హుస్నాబాద్ నియోజకవర్గంలోని పల్లెల్లో మట్టిలో మాణిక్యాలు వెలికితీసి అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులను తయారు చేయవచ్చని నియోజకవర్గ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

శ్రీశైలంలో వైభవంగా దసరా మహోత్సవాలు

కాత్యాయని అలంకారంలో శ్రీ అమ్మవారు

శ్రీశైల దేవస్థానంలో నిర్వహిస్తున్న దసరా మహోత్సవాల్లో భాగంగా ఆరవ రోజు శుక్రవారం శ్రీ అమ్మవారికి కాత్యాయని అలంకారం నిర్వహించారు. ఉదయం ప్రాతఃకాల పూజలు, విశేష కుంకుమార్చనలు, నవావరణార్చనలు, చండీహోమం, చండీ పారాయణం, చతుర్వేద పారాయణం, కుమారీ పూజలతో పాటు రుద్రహోమం, రుద్ర పారాయణలు నిర్వహించారు.నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండేళ్ల నుంచి పదేళ్లలోపు బాలికలకు పూలు, పండ్లు, నూతన వస్త్రాలు సమర్పించి కుమారీ పూజలు నిర్వహించారు. నవదుర్గల్లో ఆరవ రూపమైన కాత్యాయని దేవిని ఆరాధించడం వల్ల రోగాలు, శోకాలు, భయాలు తొలగుతాయని భక్తుల విశ్వాసం.ఈ రోజు శ్రీ స్వామిఅమ్మవార్లకు హంసవాహన సేవ నిర్వహించనున్నారు. రాత్రి 9 గంటల నుంచి అమ్మవారి ఆస్థానసేవ, సువాసినీ పూజలు, 10 గంటలకు కాళరాత్రి పూజ జరగనున్నాయి. అనంతరం వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించిన పుష్పపల్లకిపై శ్రీ స్వామిఅమ్మవార్లను మేళతాళాల నడుమ ఊరేగించనున్నారు. ఈ సేవలో బంతి, చామంతి, కనకాంబరం, రోజాలు, ఆర్కిడ్స్ తదితర పుష్పాలను వినియోగించనున్నారు.

ఉస్మానియా.. ఎందుకీ కష్టాలు?

హైదరాబాద్ : హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న ఉస్మానియా ఆసుపత్రి పేరుకు పెద్దాసుపత్రి అయినా లోపల పరిస్థితులు పూర్తిగా దారుణంగా మారాయి. రోజువారీ వైద్యం కోసం వేలాది మంది రోగులు వస్తున్నప్పటికీ కనీస వసతులు లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. చిన్న ఎక్స్ రే తీయాలన్నా యంత్రాలు పనిచేయక రోగులు తమ స్మార్ట్ ఫోన్లలో ఫొటోలు తీసుకుని వైద్యులకు పంపాల్సిన దుస్థితి నెలకొంది. మూలపడిన సీటీ స్కాన్ యంత్రాలు రోగుల సహనాన్ని పరీక్షిస్తున్నాయి. 15 సంవత్సరాల క్రితం ఉన్న సౌకర్యాలు కూడా నేడు కరువయ్యాయి. ఉచిత వైద్యం అందే ప్రభుత్వ ఆసుపత్రిపై నమ్మకం కోల్పోయి రోగులు నిరాశతో వెనుదిరుగుతున్నారు. డాక్టర్లే స్వయంగా రోడ్డుపైకి వచ్చి ఆందోళనలు చేపట్టాల్సి వస్తోందంటే అక్కడి సమస్యల తీవ్రత ఏ స్థాయిలో ఉందో ఇట్టే అర్థమవుతుంది. ఆరోగ్యశ్రీ నిధులు సకాలంలో విడుదల కాకపోవడం, సప్లయర్లు మందుల సరఫరా నిలిపివేయడం ఈ సంక్షోభానికి ప్రధాన కారణాలుగా మారుతున్నాయి. రూ.600 కోట్ల పెండింగ్ బకాయిలు ఉన్నట్లు సమాచారం.ఉస్మానియా ఆసుపత్రిలో కార్డియాలజీ, గ్యాస్ట్రోఎంట్రాలజీ వంటి 18 రకాల సూపర్ స్పెషాలిటీ సేవలు ఉన్నా గుండె జబ్బుతో వచ్చేవారికి స్టెంట్ వేసే నాథుడు లేడు. ఓపెన్ హార్ట్ సర్జరీ జరిగి ఏకంగా నాలుగేళ్లు దాటిపోవడం అక్కడి అత్యంత దయనీయ పరిస్థితిని కళ్లకు కడుతోంది. క్యాథ్ ల్యాబ్ పనిచేయకపోవడం వల్ల అత్యవసర సమయాల్లో నిమ్స్ ఆసుపత్రికి రోగులను రిఫర్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అనస్తీషియా విభాగంలో కీలక పరికరాలు లేవు. ఆర్థోపెడిక్ సర్జరీలకు అవసరమైన ఇంప్లాంట్లు రావడం లేదు. చివరికి కుట్లు వేసేందుకు ఉపయోగించే నీడిల్స్ సూచర్ మెటీరియల్స్ కూడా అందుబాటులో లేవని వైద్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓపెన్ హార్ట్ సర్జరీ చేసే బైపాస్ యంత్రానికి కనీసం బ్యాటరీ బ్యాకప్ కూడా లేదు. ఈ సమస్యల కారణంగా వైద్య విద్యార్థుల శిక్షణ కూడా తీవ్రంగా దెబ్బతింటున్నది. ఆపరేషన్ థియేటర్లలో సౌకర్యాలు లేకపోవడంతో శస్త్రచికిత్సలు అర్ధంతరంగా



ఆగిపోతున్నాయి.ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం దాతలు దొరికినా సర్జరీ చేసేందుకు అవసరమైన పరికరాల కొరత వేధిస్తోంది. ఐదు నెలలుగా లివర్ మార్పిడి కోసం తిరుగుతున్న చిన్నారి పరిస్థితి ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. అనుమతులు అన్నీ లభించినా మందులు లేవనే సాకుతో వైద్యం ఆలస్యం అవుతోంది. ప్రైవేట్ ఆసుపత్రులలో లక్షలాది రూపాయలు ఖర్చు చేయలేక మధ్యతరగతి పేద ప్రజలు అల్లాడిపోతున్నారు. ఆసుపత్రికి అవసరమైన మందులు సర్జికల్స్ సప్లై చేసేందుకు ట్విన్ సిటీస్ హాస్పిటల్స్ సప్లయర్స్ అసోసియేషన్ నిరాకరించింది. ఒక్క ఉస్మానియా ఆసుపత్రి నుంచి మాత్రమే సుమారు రూ.35 కోట్ల బకాయిలు రావాల్సి ఉందని సప్లయర్లు చెబుతున్నారు. గత రెండు సంవత్సరాలుగా ఆరోగ్యశ్రీ నిధుల నుంచి ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదని వారు వాపోతున్నారు. పాత బకాయిలు పూర్తిగా చెల్లిస్తేనే మళ్లీ సరఫరా ప్రారంభిస్తామని స్పష్టం చేస్తున్నారు. ఈ నిధుల కొరత కారణంగా అన్ని రకాల వైద్య సేవలు పూర్తిగా స్తంభించిపోయాయి.తెలంగాణ స్టేట్ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా అందాల్సిన మందుల సరఫరా కూడా నిలిచిపోయింది. ఉస్మానియా మాత్రమే కాకుండా అనుబంధంగా ఉన్న ఎమ్ఎన్‌జే, పేట్లబురుజు మెటర్నిటీ, నీలోఫర్ ఆసుపత్రులలో కూడా పరిస్థితులు ఇందుకు భిన్నంగా లేవు. వైద్య విద్యార్థులు పీజీ సీట్లు సాధించి ఇలాంటి పెద్దాసుపత్రికి వచ్చినా సరైన రోగుల శస్త్రచికిత్సలు నేర్చుకోలేకపోతున్నారు. వైద్య పరికరాలు రిపేర్ చేయించే నాథుడు లేకపోవడంతో లక్షలాది మంది రోగుల ప్రాణాలు గాలిలో దీపంలా మారాయి. అధికారులు ప్రభుత్వ పెద్దలు స్పందించి పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని అంతా కోరుతున్నారు. బకాయిలన్నీ చెల్లించి సప్లయర్లు మళ్లీ ముందుకు వస్తేనే ఆసుపత్రి గాడిన పడుతుంది. లేకపోతే నిరుపేదలకు వైద్యం అందడం అసాధ్యంగా మారుతుంది. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించే రోజు ఎప్పుడ వస్తుందోనని ప్రజలు ఎదురు చూస్తున్నారు.ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని ఉస్మానియా ఆసుపత్రిని ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వైద్య పరికరాల కొనుగోలుకు ప్రత్యేక నిధులు కేటాయించాలి. మూలనపడిన యంత్రాలను వెంటనే బాగు చేయించి అందుబాటులోకి తీసుకురావాలి. సప్లయర్లతో చర్చలు జరిపి బకాయిల సమస్యను పరిష్కరించాలి. అత్యవసర మందులు సర్జికల్స్ కొరత లేకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలి. అప్పుడే రోగులకు మెరుగైన వైద్యం అందుతుంది. లేదంటే పెద్దాసుపత్రిలో ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతూనే ఉంటుంది. వైద్యులు రోడ్డెక్కి నిరసన తెలపాల్సిన దుస్థితి పోయి ప్రశాంతంగా వైద్యం అందించే వాతావరణం కల్పించాలి. అనుబంధ ఆసుపత్రుల పరిస్థితిని కూడా మెరుగుపరచాలి. యువతకు సరైన శిక్షణ అందేలా చూడాలి. ప్రభుత్వ స్పందనపైనే ఉస్మానియా భవిష్యత్తు ఆధారపడి ఉంది.

బిజినెస్

రూ. 13.38 లక్షల కోట్ల పన్ను వసూళ్లు



న్యూఢిల్లీ: ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి అక్టోబర్ 14 వరకు ప్రత్యక్ష పన్ను వసూళ్లు నికరంగా రూ. 13.38 లక్షల కోట్లకు చేరాయి. ఇది గత ఆర్థిక సంవత్సరంలో ఇదే వ్యవధితో పోలిస్తే 13 శాతం వృద్ధి కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న లక్ష్యంలో 50 శాతం. కార్పొరేట్‌యేతర పన్ను చెల్లింపుదారులకు రిఫండ్‌లు 67 శాతం పెరిగినప్పటికీ, కార్పొరేట్ ట్యాక్స్ వసూళ్లు 20.58 శాతం పెరగడంతో ఇది సాధ్యపడింది. కేంద్రీయ ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) డేటా ప్రకారం సమీక్షాకాలంలో నికర కార్పొరేట్ ట్యాక్స్ వసూళ్లు రూ. 5.99 లక్షల కోట్లకు చేరగా, కార్పొరేట్‌యేతర ట్యాక్స్‌లు 5.83 శాతం పెరిగి రూ. 6.92 లక్షల కోట్లకు చేరాయి. సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ (ఎస్‌టీటీ) ద్వారా రూ. 73,700 కోట్ల లక్ష్యం నిర్దేశించుకోగా, ప్రస్తుతం వసూళ్లు 52 శాతం ఎగిసి రూ. 46,840 కోట్లకు చేరాయి.

ప్రపంచానికి 'ఏఐ వార్మ్'ల ముప్పు.. ముందే హెచ్చరిస్తున్న నిపుణులు!



టెక్నాలజీ ప్రపంచంలో సరికొత్త ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. 'ఏఐ వార్మ్' పేరుతో పిలుస్తున్న ఈ ముప్పు గురించి ప్రముఖ ఏఐ సంస్థ ఆంథ్రోపిక్ తన ఫ్రాంటియర్ రెడ్ టీమ్ పరిశోధనలో హెచ్చరించింది. డేటా సెంటర్లతో సంబంధం లేకుండా, ఇంటర్నెట్‌కు కనెక్ట్ అయిన సాధారణ గృహోపకరణాలలోకి చొరబడి, తమంతట తాముగా వ్యాపించగల సామర్థ్యం చిన్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) మోడళ్లకు త్వరలోనే రావచ్చని ఈ నివేదిక స్పష్టం చేసింది. ఇది ఇంటర్నెట్ భద్రతకు పెను సవాలుగా మారే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది.

ఏమిటీ ఏఐ వార్మ్?

సాధారణంగా కంప్యూటర్ వైరస్‌లు కోడ్ రూపంలో ఒక పరికరం నుంచి మరొకదానికి వ్యాపిస్తాయి. కానీ, ఏఐ వార్మ్‌లు దీనికి భిన్నం. వీటిని 'వెయిట్-బేస్డ్ రెప్లికేటర్లు' అని పిలుస్తున్నారు. అంటే, ఇవి కేవలం కోడ్‌ను కాకుండా, తమ ఏఐ మోడల్ బరువు (ఎవఅస్త్రట్టం) మొత్తాన్ని మోసుకెళతాయి. స్మార్ట్ టీవీలు, రిఫ్రిజిరేటర్లు, సెక్యూరిటీ కెమెరాలు, చౌకైన ఆండ్రాయిడ్ టీవీ బాక్సుల వంటి ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) పరికరాలను లక్ష్యంగా చేసుకుని, వాటి హార్డ్‌వేర్‌పై తమను తాము ఇన్‌స్టాల్ చేసుకుంటాయి. అక్కడి నుంచి నెట్‌వర్క్‌లోని ఇతర పరికరాలకు వ్యాపిస్తాయి. వీటికి సెంట్రల్ కమాండ్ వ్యవస్థ ఉండదు కాబట్టి, ఒక్కసారి వ్యాపించడం మొదలుపెడితే వీటిని అరికట్టడం చాలా కష్టమని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

పరిశోధనలో ఏం తేలింది?

ఈ ముప్పుపై ఆంథ్రోపిక్ రెడ్ టీమ్ బృందం పలు ప్రయోగాలు నిర్వహించింది. గూగుల్‌కు చెందిన 'జెమ్మా 4' (26దీ పారామీటర్ల) మోడల్‌ను చౌకైన ఆండ్రాయిడ్ టీవీ బాక్సులపై విజయవంతంగా నడిపారు. అయితే, దాని వేగం చాలా నెమ్మదిగా (సెకనుకు 0.39 టోకెన్లు) ఉన్నట్లు గుర్తించారు. 30 బిలియన్ల కంటే తక్కువ పారామీటర్లు ఉన్న చిన్న ఏఐ మోడళ్లు ఇప్పటికే లక్ష్యాలను గుర్తించడం, యాక్సెస్ పొందడం, తమను తాము ఇన్‌స్టాల్ చేసుకోవడం వంటి పనులను విడివిడిగా చేయగలవని తేలింది. అయితే, ఈ ప్రక్రియలన్నింటినీ ఒకేసారి తప్పుల్లేకుండా పూర్తిచేసే సామర్థ్యం ప్రస్తుతానికి వాటికి లేదు. కానీ, ఏఐ మోడళ్ల అభివృద్ధి వేగాన్ని బట్టి చూస్తే, 2026 చివరి నాటికి ఈ సామర్థ్యాన్ని అవి అందుకోవచ్చని ఆంథ్రోపిక్ అంచనా వేస్తోంది.

ముందస్తు హెచ్చరిక మాత్రమే

ప్రస్తుతానికి ఇలాంటి 'ఏఐ వార్మ్'లు వాస్తవ ప్రపంచంలో ఇంకా ఆవిర్భవించలేదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. పరిశోధనలో భాగంగా జరిపిన ప్రయోగాలు కూడా సులభతరం చేసిన నియంత్రిత వాతావరణంలో జరిగాయి. నిజ జీవితంలో వాటి వ్యాప్తి ఇంకా కష్టతరంగా ఉండొచ్చు. అయితే, ఈ పరిశోధనను ఒక ముందస్తు హెచ్చరికగా భావించాలని ఆంథ్రోపిక్ సూచించింది. భవిష్యత్తులో ఈ ముప్పును ఎదుర్కోవడానికి వినియోగదారులు, ఐఓటీ పరికరాల తయారీదారులు భద్రతా ప్రమాణాలను కఠినతరం చేయాలని పిలుపునిచ్చింది. డిఫాల్ట్ సెట్టింగ్స్‌ను మెరుగుపరచడం, అనవసరమైన పోర్ట్‌లను మూసివేయడం వంటి చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేసింది.

జియోతో ఇంటర్నెట్ చౌక.. 6జీ సేవలపై ఎండీ ఆకాశ్ అంబానీ కీలక వ్యాఖ్యలు



ముంబై, అక్టోబర్ 15: జియో ప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్ ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో) ద్వారా అందే నిధులను దాని అనుబంధ సంస్థ రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ లిమిటెడ్ (ఆర్‌జీఐఎల్ లేదా జియో) అప్పులను తీర్చేందుకు వాడుతామని ఆ కంపెనీ ఎండీ ఆకాశ్ అంబానీ స్పష్టం చేశారు. బుధవారం జియో ప్లాట్‌ఫామ్స్ తమ ఐపీవో కోసం రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ (ఆర్‌హెచ్‌పీ లేదా ప్రాథమిక పత్రాలు) దాఖలు చేసిన నేపథ్యంలో గురువారం ఇక్కడ కంపెనీ మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా ఆకాశ్ అంబానీ మాట్లాడుతూ.. రూ.30,213 కోట్ల నిధుల సమీకరణే లక్ష్యంగా జియో ప్లాట్‌ఫామ్స్ పబ్లిక్ ఇష్యూను తెస్తున్నామని, ఇందులో రూ.27,500 కోట్లదాకా జియోకున్న రుణాలను తీర్చేందుకే వినియోగిస్తామని వెల్లడించారు. తద్వారా జియో ప్లాట్‌ఫామ్స్ నికర రుణ రహిత సంస్థగా ఆవిర్భవించనుందన్నారు. అలాగే ఒక్కో టెలికాం వినియోగదారుడి నుంచి లభించే ఆదాయ సగటు (ఏఆర్‌పీయూ), 5జీ కస్టమర్ల సంఖ్యను పెంచడంపై దృష్టి పెడుతున్నట్లు వివరించారు. గత ఆర్థిక సంవత్సరం (2025-26) కంపెనీ స్థూల ఆదాయం సుమారు రూ.76,000 కోట్లుగా ఉన్నది. కాగా, ఈ నెల 21న మొదలై 23న ముగిసే జియో ఐపీవోలో షేర్ ధరల శ్రేణి రూ.1,065-1,119గా ఉన్నది. 27 కోట్ల షేర్ల ఫ్రెష్ ఇష్యూ జరుగుతున్నది. దీంతో ప్రస్తుతం దేశీయ ఐపీవో చరిత్రలో అగ్రస్థానంలో ఉన్న హ్యుందాయ్.. రెండో స్థానంలోకి వెళ్లనున్నది. షేర్ల లిస్టింగ్ ఈ నెల 28న ఉండే అవకాశాలుండగా.. సంస్థ విలువను దాదాపు రూ.10.3 లక్షల కోట్లుగా అంచనా వేశారు.

జియో డాటానే చౌక..

ప్రపంచంలో మరే దేశంలోనూ.. ఏ సంస్థ కూడా జియో ఇస్తున్నట్టుగా ఇంటర్నెట్‌ను చౌకగా ఇవ్వడం లేదని ఆకాశ్ అంబానీ అన్నారు. ఒక్కో జీబీకి జియో వసూలు చేస్తున్న ధర చాలా తక్కువని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే భారత్‌ను డిజిటల్ వైపునకు నడిపిస్తుండటంలో జియో కీలకపాత్ర పోషిస్తున్నదని గుర్తుచేశారు. అలాగే 2030-31నాటికి 1.4 ట్రిలియన్ డాలర్ల భారత డిజిటల్ ఎకానమీ లక్ష్యంలో జియోదే మెజారిటీ వాటా అని కూడా చెప్పారు. ప్రస్తుతం జియో.. దేశీయ వైర్‌లెస్ డాటా రద్దీలో 60 శాతానికిపైగా కలిగి ఉన్నదని, ఈ ఏడాది జూన్ చివరికల్లా 53.3 కోట్ల కస్టమర్లున్నారన్నారు. ఇందులో 28.5 కోట్ల మంది 5జీ వినియోగదారులని పేర్కొన్నారు. చైనా తర్వాత భారత్‌లోనే 5జీ కస్టమర్లు ఎక్కువని చెప్పారు. ఈ ఏప్రిల్-జూన్‌లో ఒక్కో కస్టమర్ నెలవారీ సగటు డాటా వినియోగం 43.7 జీబీ ఉన్నదని వివరించారు.

సాఫ్ట్‌వేర్ అప్‌గ్రేడ్లతో 6జీ

జియో ప్లాట్‌ఫామ్స్.. కొత్తగా మళ్లీ మౌలిక వసతుల విస్తరణతో కాకుండా కేవలం సాఫ్ట్‌వేర్ అప్‌గ్రేడ్లతోనే తమ కస్టమర్లకు 6జీ సేవలను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఆకాశ్ అంబానీ తెలిపారు. అలాగే 4 కోట్ల నుంచి 10 కోట్లకు హోమ్ బ్రాడ్‌బాండ్ కస్టమర్లను పెంచే దిశగా పరుగులు పెడుతున్నట్టు వివరించారు. దేశవ్యాప్తంగా జియోకు బలమైన నెట్‌వర్క్ ఉన్నదన్న ఆయన.. 3.6 లక్షల టెలికాం టవర్లు, 10 లక్షలకుపైగా కిలోమీటర్ల రూట్‌లో ఫైబర్ నెట్‌వర్క్ ఉన్నదని చెప్పారు. భారతీయ టెలికాం చరిత్రలో రిలయన్స్ జియో సృష్టించిన సంచలనాలు అన్నీఇన్నీ కావు.

కివీస్‌తో పోరుకు సై

భారత వన్డే, టెస్టు జట్లు ఇవే!

న్యూజిలాండ్ పర్యటనకు వన్డే, టెస్టు జట్లను ప్రకటించిన బీసీసీఐ

టెస్టు సిరీస్‌తో పాటు, తొలి మూడు వన్డేలకు శుభ్‌మన్ గిల్ కెప్టెన్

చివరి రెండు వన్డేలకు శ్రేయస్ అయ్యర్‌కు సారథ్య బాధ్యతలు

టెస్టు జట్టులోకి రిషభ్ పంత్ పునరాగమనం, ఫిట్‌నెస్‌పై ఆధారపడి అవకాశం

వన్డే సిరీస్‌కు రోహిత్, కోహ్లీ ఎంపిక



న్యూజిలాండ్‌తో త్వరలో జరగనున్న సుదీర్ఘ పర్యటన కోసం భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) వన్డే, టెస్టు జట్లను ప్రకటించింది. టీ20 సిరీస్ ముగిసిన అనంతరం ఇరు జట్ల మధ్య ఐదు వన్డేలు, రెండు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌లు జరగనున్నాయి. ఈ పర్యటనలో యువ ఆటగాడు శుభ్‌మన్ గిల్‌కు కీలక బాధ్యతలు అప్పగించారు. టెస్టు సిరీస్‌తో పాటు, వన్డే సిరీస్‌లోని తొలి మూడు మ్యాచ్‌లకు గిల్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు.

ఆసక్తికరంగా, వన్డే సిరీస్‌కు రెండు వేర్వేరు జట్లను సెలక్షన్ కమిటీ ఎంపిక చేసింది. తొలి మూడు వన్డేలకు శుభ్‌మన్ గిల్ నాయకత్వం వహించనుండగా, చివరి రెండు వన్డేలకు శ్రేయస్ అయ్యర్ జట్టును నడిపించనున్నాడు. సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వన్డే సిరీస్‌కు ఎంపికయ్యారు. గాయం నుంచి కోలుకుంటున్న వికెట్ కీపర్ రిషభ్ పంత్ టెస్టు జట్టులోకి పునరాగమనం చేశాడు. అయితే, అతని ఎంపిక ఫిట్‌నెస్ క్లియరెన్స్‌పై ఆధారపడి ఉంటుందని బీసీసీఐ స్పష్టం చేసింది.

తొలి మూడు వన్డేలకు భారత జట్టు:

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్ (వైస్ కెప్టెన్), కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), నితీశ్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, నమన్ ధీర్, అన్షుల్ కంబోజ్, గుర్నూర్ బ్రార్, రుతురాజ్ గైక్వాడ్, అర్ష్‌దీప్ సింగ్, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), మహమ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ (ఫిట్‌నెస్‌పై ఆధారపడి), కుల్దీప్ యాదవ్.

4, 5వ వన్డేలకు భారత జట్టు:

శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, తిలక్ వర్మ, ఇషాన్ కిషన్ (వైస్ కెప్టెన్, వికెట్ కీపర్), నితీశ్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, నమన్ ధీర్, అకిబ్ నబీ, గుర్నూర్ బ్రార్, రుతురాజ్ గైక్వాడ్, అర్ష్‌దీప్ సింగ్, కుమార్ కుశాగ్ర (వికెట్ కీపర్), మహమ్మద్ సిరాజ్, యశ్ ఠాకూర్, కుల్దీప్ యాదవ్.

టెస్టు సిరీస్‌కు భారత జట్టు:

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్ (వైస్ కెప్టెన్), దేవదత్ పడిక్కల్, రిషభ్ పంత్ (వికెట్ కీపర్, ఫిట్‌నెస్‌పై ఆధారపడి), ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), రవీంద్ర జడేజా, అన్షుల్ కంబోజ్, జస్ప్రీత్ బుమ్రా, ప్రసిద్ధ్ కృష్ణ, ఆకాశ్ దీప్, సాయి సుదర్శన్, నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, మహమ్మద్ సిరాజ్.

న్యూజిలాండ్ పర్యటన షెడ్యూల్

వన్డే సిరీస్

మ్యాచ్	తేదీ	వేదిక	సమయం (భారత కాలమానం ప్రకారం)
1వ వన్డే	నవంబర్ 04	ఆక్లాండ్	ఉదయం 7:30 గంటలకు
2వ వన్డే	నవంబర్ 07	వెల్లింగ్టన్	ఉదయం 7:30 గంటలకు
3వ వన్డే	నవంబర్ 10	హామిల్టన్	ఉదయం 7:30 గంటలకు
4వ వన్డే	నవంబర్ 13	మౌంట్ మాంగనూయి	ఉదయం 7:30 గంటలకు
5వ వన్డే	నవంబర్ 15	మౌంట్ మాంగనూయి	ఉదయం 7:30 గంటలకు

టెస్టు సిరీస్

మ్యాచ్	తేదీ	వేదిక	సమయం (భారత కాలమానం ప్రకారం)
1వ టెస్టు	నవంబర్ 19	వెల్లింగ్టన్	ఉదయం 3:30 గంటలకు
2వ టెస్టు	నవంబర్ 27	క్రైస్ట్‌చర్చ్	ఉదయం 3:30 గంటలకు

స్పోర్ట్స్


19 పరుగులకే 4 వికెట్లు.. అయినా భారత్ అద్భుత విజయం



రాయ్‌పూర్ వేదికగా శుక్రవారం జింబాబ్వేతో జరిగిన తొలి టీ20లో భారత మహిళల జట్టు 4 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ గెలుపుతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన జింబాబ్వే నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 114 పరుగులు చేసింది. జింబాబ్వే బ్యాటర్లలో కెలిస్ ఎండ్‌లోపు (44 బంతుల్లో 42), షార్నే మేయర్స్ (33 బంతుల్లో 43 నాటౌట్) రాణించారు. భారత బౌలర్లలో నందిని శర్మ రెండు వికెట్లు పడగొట్టగా.. షెఫాలీ వర్మ, అరుంధతి రెడ్డి, శ్రీచరణి తలా వికెట్ సాధించారు.

అరంగేట్రంలో అదుర్స్

అనంతరం 115 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన భారత జట్టుకు జింబాబ్వే రైటార్మ్ స్పిన్నర్ నిషా గ్వాంజురా బిగ్ షాకిచ్చింది. కెప్టెన్ స్మృతి మంధానతో పాటు షెఫాలీ వర్మ, అనుష్కశర్మ(4)లను ఆరంభంలోనే నిషా గ్వాంజురా పెవిలియన్‌కు పంపింది. మాజీ కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ కూడా కేవలం ఒక్క పరుగు చేసి ఔటయ్యింది. దీంతో భారత్ కేవలం 19 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ సమయంలో స్టార్ ఆల్‌రౌండర్ దీప్తి శర్మ (49), అరంగేట్ర బ్యాటర్ నికి ప్రసాద్ (39 నాటౌట్) బాధ్యతాయుతంగా ఆడి జట్టును ఆదుకున్నారు. ఫలితంగా ఈ స్వల్ప లక్ష్యాన్ని ఉమెన్ ఇన్ బ్లూ 15.4 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి చేధించింది.



'రణబాలి' మూవీ రివ్యూ

విజయ్ దేవరకొండ బాక్సాఫీస్ పూనకం!

చరిత్ర పుటల్లో మరుగునపడిపోయిన వీరుల కథలను వెండితెరపైకి తీసుకొచ్చి, వారి పోరాటాలను నేటి తరానికి పరిచయం చేయడం గొప్ప ప్రయత్నం. ముఖ్యంగా బ్రిటిష్ పాలనలో ప్రజలు ఎదుర్కొన్న ఆకలి బాధలు, కరువు కాటకాలు, దోపిడీ, అణచివేత వంటి అంశాలను భావోద్వేగాలతో మేళవించి చెప్పడం అంత సులభం కాదు. అలాంటి ఒక మరుగునపడిపోయిన వీరుడి జీవితాన్ని, పోరాటాన్ని తెరపై ఆవిష్కరించిన చిత్రమే 'రణబాలి'. విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటించిన ఈ చిత్రానికి 'టాక్సీవాలా' ఫేమ్ రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వం వహించారు. బలమైన చారిత్రక నేపథ్యం, మానవీయ భావోద్వేగాలు, తిరుగుబాటు స్ఫూర్తి కలగలిసిన ఈ సినిమా ప్రేక్షకులకు ఎలాంటి అనుభూతిని అందించింది? భారీ అంచనాలతో వచ్చిన ఈ సినిమా అంచనాలని అందుకుందా? రివ్యూలో చూద్దాం.

కథ

బ్రిటిష్ పాలనలో మద్రాస్ ప్రాంతం తీవ్రమైన కరువును చూసిన కాలమది. రాయలసీమ ప్రాంతంలోని సింగనమల ప్రాంతానికి రక్షణగా ఉంటాడు భద్రమల్లన్న స్వామి. ఆ స్వామి ఆశీస్సులతో జన్మిస్తాడు రణబాలి (విజయ్ దేవరకొండ). తన పుట్టుకకు ఓ కారణం ఉంటుంది. తన ప్రజలను కరువు రాక్షసుడి నుంచి కాపాడటం తన కర్తవ్యం. బ్రిటిష్ జనరల్ ఆర్నాల్డ్ వోస్లూ రూపంలో వస్తాడు ఆ కరువు రాక్షసుడు. దేశంలో లేని కరువును సృష్టిస్తాడు. అన్నపూర్ణ అయిన ఈ దేశాన్ని ఆకలి చావులతో అలమటించేలా చేసి, ఇక్కడ పండిన ధాన్యపు రాశులను ఇంగ్లాండ్‌కు రవాణా చేసే పన్నాగం పన్నుతాడు. ఆ బ్రిటిష్ ఆకృత్యాల నుంచి రణబాలి తన ప్రజలను ఎలా రక్షించుకున్నాడు? ప్రజల ఆకలి తీర్చడానికి ఎలాంటి పోరాటం చేశాడనేది మిగతా కథ.

విశ్లేషణ

చరిత్రలో మరుగునపడిపోయిన ఓ వీరుడి కథ ఇది. ఒక వ్యక్తి పోరాటం వెనుక ఉన్న ప్రజల బాధలను, ఆ కాలపు సామాజిక పరిస్థితులను ఆవిష్కరించడంతో పాటు, కథలో భాగంగా భద్రమల్లన్న జానపద గాథను దర్శకుడు మేళవించిన తీరు ఆద్యంతం ఆకట్టుకునేలా ఉంటుంది. 'రణబాలి'లో ప్రధానంగా ఆకట్టుకునేది కథాంశం. దాని వెనుక ఉన్న మానవీయ కోణం. బ్రిటిష్ పాలనలో ప్రజలు ఎదుర్కొన్న దారుణమైన పరిస్థితులను దర్శకుడు కొన్ని సన్నివేశాల్లో హృదయానికి హత్తుకునేలా చూపించారు. కరువు కారణంగా ఆకలితో అలమటించే ప్రజలు, తమ కుటుంబాలను కాపాడుకోవడానికి వారు పడే తపన, జీవనం కోసం చేసే పోరాటం ప్రేక్షకులను భావోద్వేగానికి గురిచేస్తాయి. తెరపై కనిపించే సన్నివేశాలు, ప్రజల కన్నీళ్లు, వారి దుర్భర జీవితాలను ప్రతిబింబించే సన్నివేశాలు కథకు వాస్తవికతను తీసుకొస్తాయి. చరిత్రలోని ఒక చీకటి అధ్యాయాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చే ప్రయత్నం ఈ చిత్రానికి ప్రత్యేకతను తీసుకొస్తుంది. రణబాలి పుట్టుక, భద్రమల్లన్న నేపథ్యం, ఊర్లో జాతర, అక్కడ రణబాలిపై జరిగిన దాడి, తొలి యాక్షన్ ఘట్టం.. ఇవన్నీ ప్రేక్షకుడిని కథలో లీనం చేస్తాయి. జయమ్మ పాత్రలో రష్మిక పరిచయం, పెళ్లి తర్వాత వచ్చే సన్నివేశాలు హత్తుకునేలా ఉంటాయి. ఇంటర్వెల్ సీక్వెన్స్ సినిమాకు మేజర్ హైలైట్‌గా నిలుస్తుంది. ఇంటర్వెల్ తర్వాత కూడా కథ మరింత తీవ్రతతో సాగుతుంది. బ్రిటిష్ వాళ్లు స్వాధీనం చేసుకున్న ఆహారాన్ని రణబాలి తిరిగి తీసుకొచ్చి ప్రజలకు అందించే ఎపిసోడ్‌లో అతని పోరాట స్ఫూర్తి మరో స్థాయిలో నిలుస్తుంది. ప్రీ క్లైమాక్స్‌లో వచ్చే ఎమోషనల్ సీన్స్ కదిలిస్తాయి. ఈ సన్నివేశాలు కథలోని మానవీయ భావోద్వేగాలను మరింత అందంగా ఆవిష్కరిస్తాయి. ఇక చివర్లో భద్రమల్లన్న స్వామి పాత్రను ఉపయోగించుకున్న తీరు థియేటర్లలో పూనకం తెప్పిస్తుంది.

నటీనటుల నటన

రణబాలి పాత్ర విజయ్ దేవరకొండ కెరీర్‌లో ఒక మైలురాయిగా నిలిచిపోతుంది. నటుడిగా తనను మరో స్థాయిలో నిలబెట్టిన ప్రదర్శన కనబరిచారు. పాత్రలోని తీవ్రత, ఆవేశం, పోరాట స్ఫూర్తిని తెరపై అద్భుతంగా ఆవిష్కరించారు. యాక్షన్ సన్నివేశాలతో పాటు భావోద్వేగ సందర్భాల్లోనూ పాత్రకు పూర్తి న్యాయం చేశారు. రష్మిక జయమ్మ పాత్రలో సహజంగా కనిపిస్తూ మెప్పించారు. విజయ్ దేవరకొండతో ఆమెకు సంబంధించిన సన్నివేశాలు అందంగా, హత్తుకునే భావోద్వేగాలతో సాగుతాయి. వీరిద్దరి మధ్య కెమిస్ట్రీ సినిమాకు మంచి ఆకర్షణగా నిలుస్తుంది. ఈశ్వరి రావు పాత్ర కథకు మరింత బలాన్ని తెచ్చింది. బ్రిటిష్ జనరల్ ఆర్నాల్డ్ వోస్లూ పాత్రలో కావాల్సిన క్రూరత్వం కనిపించింది. కథలోని సామాజిక, చారిత్రక నేపథ్యానికి అనుగుణంగా మిగతా పాత్రలు కూడా తమ వంతు సహకారం అందించాయి.

టెక్నికల్ విభాగం

చరిత్రలో మరుగునపడిపోయిన ఒక వీరుడి కథను ఎంచుకోవడం, దాని వెనుక ఉన్న సామాజిక పరిస్థితులను తెరపైకి తీసుకురావడంలో రాహుల్ సాంకృత్యన్ అద్భుతమైన పనితీరు కనబరిచారు. ప్రజల బాధలు, తిరుగుబాటు స్ఫూర్తి, జానపద గాథ వంటి భిన్నమైన అంశాలను ఒకే కథలో చక్కగా మేళవించారు. కొన్ని భావోద్వేగ సన్నివేశాలను హృద్యంగా తెరకెక్కించడం ఆయన దర్శకత్వ ప్రతిభకు నిదర్శనం. బ్రిటిష్ కాలం నాటి పరిస్థితులను సంభాషణలు, సంఘటనల ద్వారా వాస్తవానికి దగ్గరగా తీయడం అభినందనీయం. చారిత్రక నేపథ్యానికి తగిన నిర్మాణ విలువలతో సినిమాను గ్రాండ్‌గా నిర్మించారు. కెమెరా వర్క్ కూడా టాప్ క్వాలిటీతో ఉంది. ఎడిటింగ్ ఇంకాస్త పదునుగా ఉండొచ్చు. అలాగే, అజయ్--అతుల్ కొన్ని చోట్ల మరింత బలంగా నేపథ్య సంగీతాన్ని ఇచ్చే అవకాశాన్ని చేజార్చుకున్నారనిపించింది.

ప్లస్ పాయింట్స్

బలమైన చారిత్రక కథాంశం
విజయ్ దేవరకొండ పవర్‌ఫుల్ నటన
విజయ్ దేవరకొండ--రష్మిక మందన్న సన్నివేశాలు
ఇంటర్వెల్ సీక్వెన్స్, క్లైమాక్స్
భావోద్వేగ ఘట్టాలు
భద్రమల్లన్న జానపద గాథ


మైనస్ పాయింట్స్

అక్కడక్కడా నెమ్మదైన కథనం
నేపథ్య సంగీతం

ఫైనల్‌గా: చరిత్రలో జరిగిన సంఘటనలను కమర్షియల్ హిస్టారికల్ ఫిక్షన్‌గా మలిచిన తీరు ఆద్యంతం ప్రేక్షకుడిని కట్టిపడేస్తుంది. విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న, రాహుల్ సాంకృత్యన్ కెరీర్లలో ఈ చిత్రం గుర్తుండిపోయే స్థానాన్ని సంపాదించుకుంటుంది. బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపించే అవకాశం పుష్కలంగా ఉంది.

రేటింగ్: 3.5/ 5

రా అండ్ రస్టిక్ యాక్షన్ లవ్ స్టోరీతో రానున్న 'డానీ'.. నవంబర్ 13న గ్రాండ్ రిలీజ్!



టాలీవుడ్‌లో వైవిధ్యమైన కథాంశాలతో ప్రేక్షకులను అలరిస్తున్న యువ హీరో ఆశిష్ గాంధీ, టాలెంటెడ్ డైరెక్టర్ కళ్యాణ్‌జీ గోగణ కాంబినేషన్‌లో వస్తోన్న మోస్ట్ అంటెసిపేటెడ్ మూవీ 'డానీ'. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'నాటకం' సినిమా ఎలాంటి సంచలనం సృష్టించిందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇప్పుడు అదే జోరుతో అంతకుమించిన ఇంటెన్సివ్ కంటెంట్‌తో ఈ కొత్త సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. రిజ్వాన్ ఎంటర్టైన్మెంట్, కళ్యాణ్‌జీ కంటెంట్ పిక్చర్స్ పతాకాలపై ప్రముఖ నిర్మాత రిజ్వాన్ ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. రొమాంటిక్, క్రైమ్, రా అండ్ రస్టిక్ జోనర్‌లో తెరకెక్కిన ఈ చిత్రంపై ట్రేడ్ సర్కిల్స్‌లో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా ఫస్ట్ స్ట్రైక్ ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందనను సొంతం చేసుకుంది. సినిమాలోని బోల్డ్ కంటెంట్, రా అండ్ రస్టిక్ మేకింగ్ స్టైల్ యూత్‌ను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. సాధారణ ప్రేమ కథలకు భిన్నంగా, మనిషి జీవితంలో ఉండే అలవాట్లకు, అతను మనసారా కోరుకునే ప్రేమకు మధ్య జరిగే భావోద్వేగ సంఘర్షణే ఈ చిత్రానికి ప్రధాన హైలైట్ కానుంది. ఓ వ్యక్తి తన జీవితంలో అలవాటు చేసుకున్న పద్ధతులు అతని గమ్యభావితాన్ని ఎలా మార్చాయి? ఆ వ్యక్తి నిజమైన ప్రేమలో పడిన తర్వాత తన జీవితంలో ఎలాంటి పెనుమార్పులు వచ్చాయి? ఈ రెండు విభిన్నమైన ధోరణుల మధ్య నలిగిపోయే పాత్రల ప్రయాణం ఎలా సాగిందనే ఆసక్తికరమైన అంశాలతో ఈ సినిమాను అత్యంత సహజంగా తెరకెక్కించారు. ఈ చిత్రంలో ఆశిష్ గాంధీ సరసన సేజల్ గుప్తా హీరోయిన్‌గా నటిస్తుండగా, సోనాల్ సింగ్, అజర్ ఖాన్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. మేకర్స్ తాజాగా విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్ సినిమాపై క్యూరియాసిటీని మరింత పెంచేసింది. హీరో హీరోయిన్ల డిఫరెంట్ లుక్స్, పోస్టర్ డిజైన్ తీరు సినిమా నేపథ్యాన్ని కళ్లకు కట్టినట్లు చూపుతున్నాయి. ఈ చిత్రానికి టాలెంటెడ్ మ్యూజిక్ డైరెక్టర్ సాయి కార్తీక్ అందిస్తున్న బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ సినిమాకే ప్రధాన ఆకర్షణగా నిలవనుందని యూనిట్ వర్గాలు చెబుతున్నాయి. ఏకే ఆనంద్ సినిమాటోగ్రఫీ, మణికాంత్ ఎడిటింగ్ బాధ్యతలు అద్భుతంగా నిర్వర్తించారు. కొల్లి గోపాల కృష్ణ సమర్పణలో వస్తోన్న ఈ చిత్రానికి ఖుషి, సుధాకర్ గోడ సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. భార్గవ్ తోట ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా, రామ్ సుంకర మరియు కళ్యాణ్‌జీ గోగణ యాక్షన్ కొరియోగ్రఫీ అందించగా, సాయిరామ్ జల్లా కో-డైరెక్టర్‌గా సేవలందించారు. రిథమ్ స్టూడియోస్ సౌండ్ డిజైన్ చేయగా, కోటి వర్క్ పబ్లిసిటీ డిజైన్స్ అందించారు. సాయి సతీష్ పీఆర్వోగా వ్యవహరిస్తున్నారు. అన్ని హంగులు పూర్తి చేసుకున్న ఈ రా అండ్ రస్టిక్ రొమాంటిక్ క్రైమ్ డ్రామా 'డానీ' సినిమాను ప్రపంచవ్యాప్తంగా నవంబర్ 13న ఘనంగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.



విజువల్ వండర్‌గా 'రామాయణం' కొత్త ట్రైలర్.. శ్రీరాముడిగా రణ్‌బీర్, రావణాసురుడిగా యశ్ అదుర్స్!



ఇండియన్ సినిమా చరిత్రలో భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న మైథలాజికల్ ప్రాజెక్ట్ 'రామాయణం: రైజ్ ఆఫ్ ఎ లెజెండ్' నుంచి మేకర్స్ కొత్త ట్రైలర్‌ను విడుదల చేశారు. హిందీతో పాటు తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఒకేసారి ఈ సరికొత్త ట్రైలర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. 'దంగల్' వంటి ఇండస్ట్రీ హిట్ సినిమాలను అందించిన ప్రముఖ దర్శకుడు నితేష్ తివారీ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా విడుదలైన ఈ రెండో ట్రైలర్ సినిమాపై అంచనాలను నెక్స్ట్ లెవెల్‌కి తీసుకెళ్లింది. ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడిగా కనిపించనుండగా, టాలీవుడ్ సెన్సేషన్ సాయి పల్లవి సీతాదేవి పాత్రలో అమాయకత్వంతో మెప్పించనున్నారు. ఇక రాకింగ్ స్టార్ యశ్ పవర్‌ఫుల్ రావణాసురుడి పాత్రలో భీకరంగా కనిపిస్తున్నాడు. ఇక ఈ చిత్రం మొదటి భాగం నవంబర్ 5, 2026న ప్రపంచవ్యాప్తంగా అట్టహాసంగా థియేటర్లలో విడుదల కానుంది. ఐమ్యాక్స్ ఫార్మాట్‌లోనూ విడుదలవుతున్న ఈ చిత్రం ఇండియన్ సినిమా స్థాయిని గ్లోబల్ స్థాయిలో నిలబెడుతుందని తాజా ట్రైలర్ స్పష్టం చేస్తోంది.

'కుంభ'లోని శక్తిని ఇప్పుడే తట్టిలేపాలని అనుకోవడం లేదు.. పృథ్వీరాజ్ బర్త్‌డేపై రాజమౌళి ట్వీట్

టాలీవుడ్ అగ్ర దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కిస్తున్న మోస్ట్ అంటెసిపేటెడ్ పాన్ వరల్డ్ మూవీ 'వారణాసి' సూపర్‌స్టార్ మహేష్ బాబు హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో మలయాళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ ఒక శక్తివంతమైన పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే. కాగా, తాజాగా పృథ్వీరాజ్ సుకుమారన్ పుట్టినరోజు సందర్భంగా రాజమౌళి ఆయనకు సోషల్ మీడియా వేదికగా ప్రత్యేకంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పృథ్వీరాజ్ బర్త్‌డే సందర్భంగా రాజమౌళి చేసిన ట్వీట్ ప్రస్తుతం సినీ వర్గాల్లో, అభిమానులలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది. "హ్యాపీ బర్త్‌డే పృథ్వీ. ఈరోజు నీలోని 'కుంభ'ను తట్టిలేపాలని నేను అనుకోవడం లేదు. ప్రపంచంపై తనదైన ముద్ర వేయడానికి తలరాతతో ముడిపడి ఉన్న కుంభ అతడు" అంటూ రాజమౌళి రాసుకొచ్చారు. 'కుంభ' అనేది 'వారణాసి' చిత్రంలో పృథ్వీరాజ్ పోషిస్తున్న పాత్ర పేరు కావడం విశేషం. ఈ చిత్రంలో మహేష్ బాబు సరసన ప్రియాంక చోప్రా జోనాస్ నటిస్తుండగా, పృథ్వీరాజ్ సుకుమారన్ రోల్ సినిమాకే హైలైట్‌గా నిలవనుందని సమాచారం.

వెంకీ, త్రివిక్రమ్ 'ఆదర్శ కుటుంబం' మరోసారి వాయిదా.?

టాలీవుడ్ ప్రేక్షకులతో పాటు విక్టరీ వెంకటేశ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న క్రేజీ కాంబినేషన్ సినిమా మరోసారి వాయిదా పడిన సంగతి తెలిసిందే. విక్టరీ వెంకటేశ్ కథానాయకుడిగా, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఆదర్శ కుటుంబం' (హౌస్ నంబర్ 47). ఈ సినిమాపై మొదటి నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే, గతంలో పలుమార్లు విడుదల తేదీ మారిన ఈ చిత్రం, తాజాగా అక్టోబర్ 9న థియేటర్లలోకి రావాల్సి ఉండగా.. మరోసారి వాయిదా పడటం అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది. సినిమా చివరి దశలో సాంకేతిక పనులు అనుకున్న సమయానికి పూర్తికాకపోవడంతోనే విడుదలను వాయిదా వేయాల్సి వచ్చిందని నిర్మాత నాగవంశీ వెల్లడించారు.

PRINTED AND PUBLISHED BY MUPPIRISETTY JAGADEESH, On behalf of CATERWEALTH MEDIA LLP, PRINTED at M/S. SREE SESHASAI ENTERPRISES, D.NO. NEW. 3-88, OLD. 3-22, GOSALA, CHANDRA THEATER ROAD, PENAMALURU-521151, KRISHNA DISTRICT, ANDHRA PRADESH, PUBLISHED AT CATERWEALTH MEDIA LLP, 3RD FLOOR, 59-12-9A, FIRST LINE, GAYATHRI NAGAR, VIJAYAWADA, NTR DISTRICT, ANDHRA PRADESH. EDITOR: MUPPIRISETTY JAGADEESH. RNI REGD NO. APTEL/2016/70247, Email I D : mahanagarap@gmail.com Phone : 9044417999